Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com

సంపుటి : 4
సంచిక : 64
మంగళవారం
ఆగస్టు, 15, 2023

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

పేజీలు - 8 వెల - రూ 5 : 00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon, Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## గ్రూప్-3 దరఖాస్తుల సవరణకు అవకాశం

హైదరాబాద్: గ్రూప్-3 దరఖా స్తుల సవరణకు టీఎస్‌పీఎస్సీ అవకాశం కల్పించింది. ఈ నెల 16 నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు తమ దరఖాస్తులను ఎడిట్ చేసుకోవచ్చు. 1388 గ్రూప్-3 పోస్టుల కు 5,36,477 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఒక్కో ఉద్యోగానికి సగటున 394 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అక్టోబర్ లో గ్రూప్-3 పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో గ్రూప్-3 కేటగిరీలో 1,375 ఉద్యోగాల భర్తీకి గతేడాది డిసెంబర్ 30న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. గ్రూప్-3లో కొత్తగా మరో 13 ఉద్యోగాలను జతచేస్తూ ఈ ఏడాది జూన్ నెలలో టీఎస్‌పీఎస్సీ ప్రకటన జారీ చేసింది. ప్రస్తుతం.. ఇరిగేషన్ విభాగం, ఐ అండ్ కాడ్‌లో కొత్తగా మరో 13 ఉద్యోగాలను జత చేస్తున్నట్టు తెలిపింది. కొత్తగా కలిపిన ఉద్యోగాలతో కలిపితే మొత్తం గ్రూప్-3 ఉద్యోగాల సంఖ్యం 1388కి పెరిగింది.



### పంద్రాగస్ట్ వేడుకలకు

## గోల్కొండ ముస్తాబు

### ఏర్పాట్లను పరిశీలించిన సిఎస్ శాంతికుమారి
### నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు

హైదరాబాద్: గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం పరిశీలించారు. వేదికతో పాటు వేడుకలు నిర్వహించే ప్రాంతాల్లో కలియతిరిగిన సీఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..పంద్రాగస్టు వేడుకల ను పురస్కరించుకుని అధికారులంతా సమన్వయంతో పనిచేసి, తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. బ్లూ బుక్ ప్రకారం పోలీసుశాఖ తగిన బందో బస్తు ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ మళ్లింపుల సమాచారాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేయాలన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్తు, సీటింగ్, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్యసేవలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను సీఎస్ పరిశీలించారు. వేడుకలు సజావుగా నిర్వహించేందుకు, వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను జీఏడీ అధికారులు సీఎస్‌కు వివరించారు. ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్‌బాబు, ఆర్‌అండ్‌బీ సెక్రటరీ శ్రీనివాసరాజు, జీహెచ్ఎంసీ కమిషన్ రోనాల్డ్‌రోస్, జలమండలి ఎండీ దానకిషోర్, ఐఅండ్ పీఆర్ కమిషనర్ అశోక్‌రెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు

## పటిష్టమైన భద్రత..

### తొలిసారిగా ఇజ్రాయెల్ కెమెరాల వినియోగం..!



ఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఢిల్లీ ముస్తాబైంది. ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేసి,జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. ఆగస్టు 15 సందర్భంగా భద్రతా సంస్థలు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాయి. ఢిల్లీ పోలీసులతో పాటు ఇతర ఏజెన్సీలకు చెందిన సుమారు 10వేల మందికిపైగా ఎర్రకోట వద్ద మోహరించారు. అలాగే ప్రత్యేక శిక్షణ పొందిన కమాండోలను యమునా నదిలో మోహరించారు. దీంతో పాటు డ్రోన్లతో ఆ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఎర్రకోట నుంచి ఢిల్లీ సరిహద్దుల వరకు ప్రత్యేకంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఢిల్లీ సరిహద్దులను మూసివేయ నున్నారు. సరిహద్దుల్లో వాహనాలను తనిఖీ చేసిన తర్వాత ఢిల్లీలోకి అనుమతించను న్నారు. అలాగే సరిహద్దుల నుంచి వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంచారు.

ఉగ్రవాదులు, దుండగులకు సంబంధిన సమాచారం విషయంలో ఢిల్లీ పోలీసులు పొరుగు రాష్ట్రాల పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఎర్రకోట దగ్గర పీసీఆర్ వ్యాన్ నిరంతరం గస్తీ తిరుగుతున్నది. ఎన్ఎస్‌జీ, ఎస్‌పీజీ, పారామిలటరీ బలగాలు, ఢిల్లీ పోలీసుల సిబ్బందిని మోహరించారు. ఎర్రకోట వద్ద యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌ని మోహరించా రు. దీని సహాయంతో ఎర్రకోట పరిసరాల్లో ఎగిరే ఎలాంటి వస్తువునైనా నియంత్రించనున్నది. వేడుకల సందర్భంగా సోమవారం ఢిల్లీ పోలీ సులు ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లను పరిశీ లించి, భద్రతా సిబ్బందికి అవసరమైన మార్గదర్శ కాలను జారీ చేయగా.. వివిధ భద్రతా సంస్థల మధ్య సమన్వయం కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా.. ఎర్రకోట వద్ద వేదికను భద్రతను పటిష్టం చేసేందుకు ఢిల్లీ పోలీసులు తొలిసారిగా ఇజ్రాయెల్‌కు చెందిన ఎఫ్ఆర్ఎస్ టెక్నాలజీకి చెందిన కెమెరాలను తొలి సారిగా వినియోగించనున్నారు. ఆయా కెమెరాలు ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ సహాయంతో అనుమానితులను సైతం గుర్తించే సామర్థ్యం ఉన్నది.

మరో వైపు ఎర్రకోట చుట్టు పక్కల ప్రాంతంలో ఉదయం 4 గంటల నుంచి 11 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండనున్నాయి.

### రైతులకు కేసీఆర్ సర్కార్

## గుడ్ న్యూస్..

### రూ. లక్షలోపు రుణాలన్నీ మాఫీ..



హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు తెలంగాణ రైతాంగానికి ప్రభుత్వం శుభవార్తను చెప్పింది కేసీఆర్ సర్కార్... ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తున్నట్టు ప్రకటించింది. ఒక్కరోజే ఏకంగా 10, 79,721 మంది రైతులకు రూ.6,546. 05 కోట్ల రుణాలను మాఫీ చేసింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదును ఆర్థికశాఖ జమ చేసింది. తాజా రుణమాఫీతో కలిపి ఇప్పటివరకు 16.66 లక్షల మంది రైతులకు రాష్ట్రప్రభు త్వం రుణమాఫీ పూర్తి చేసినట్లు అయింది. మొత్తంగా రూ.7,753 కోట్లను రుణామా ఫీకి ప్రభుత్వం ఖర్చు చేసింది. రైతుల బ్యాంక్ అకౌంట్లో రుణమాఫీ డబ్బులు జమ చేస్తామని, తెలంగాణలోని రూ.99 వేల లోపు పంట రుణాలు మాఫీకి సంబంధించిన మొత్తాన్ని ప్రభుత్వం సోమవారం నుంచి విడుదల చేయనుందని వివరించారు. మరో పక్షం రోజుల్లో రూ.లక్ష ఆపై ఉన్నపంట రుణాలను మాఫీ చేసేందుకు నిధులు విడుదల చేస్తామన్నారు. మొత్తంగా నెల లోపు తెలంగాణ ప్రభుత్వం పూర్తి రుణ మాఫీ చేయనుందని స్పష్టం చేశారు.

## తెలంగాణ మలి ఉద్యమంలో తొలి ఆత్మత్యాగి శ్రీకాంతచారి

### ఆగస్టు 15...శ్రీకాంతచారి జయంతి



(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి ఆగస్ట్ 14 9 ప్రజా మంటలు బ్యూర్) : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుంది. శ్రీకాంతచారి (ఆగష్టు 15, 1986 - డిసెంబర్ 3, 2009) మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమర వీరుడు. నల్గొండ జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన కాసోజు వెంకటచారి, శంకరమ్మ దంపతుల పెద్ద కుమారుడుగా సాధారణ కుటుంబంలో 1986 సంవత్సరంలో స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు15) రోజున జన్మించాడు శ్రీకాంతచారి. తండ్రి వెంకటచారి వ్యవసాయంతో పాటు వృత్తి పనులు చేస్తుంటాడు. రవీంద్రాచారి అనే తమ్ముడు ఉన్నాడు. శ్రీకాంతచారి ఆడుతూ పాడుతూ చలాకీగా ఉండేవాడు. సమాజసేవలో ముందుండేవాడు. ఎవరు సాయం కోరినా కాదనేవాడు కాదు. తాను దాచుకున్న డబ్బును పేదలు, స్నేహితుల కోసం ఖర్చు చేసేవాడు. స్థానికంగానే ప్రాథమిక విద్యను పూర్తిచేసిన శ్రీకాంత్ మోత్కూరు, నకిరేకల్ గ్రామాల్లో అభ్యసించాడు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లిన శ్రీకాంతచారి తొలుత బీజేపీ లో ఆ తరువాత టీఆర్ఎస్ లో క్రియాశీలక కార్యకర్తగా, విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్రను పోషించాడు. తెలంగాణ ఉద్యమ కార్యక్రమాలను ముందుండి నడిపేవాడు. సెలవుల్లో ఇంటికి వెళ్లినా.. తెలంగాణ ధ్యాసే. తెలంగాణ ఉద్యమ సంబంధిత పాటలు పాడుతూ తెలంగాణ నినాదాలు చేస్తూ కవితలు రాస్తూ ఉండేవాడు. తెలంగాణ అతడి ఊతపదమైంది. ఈ క్రమంలో తెలంగాణ కోసం టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేపట్టిన అమరణదీక్ష శ్రీకాంత్‌లో ఉద్యమావేశాన్ని నింపింది. తెలంగాణ ఉద్యమ కారులపై ప్రభుత్వం దమనకాండ, అరెస్టులను చూసి శ్రీకాంత్ తట్టు కోలేక పోయాడు. ఆ ఉద్వేగంతో, కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో తన ఆత్మ త్యాగం తర్వాతైనా మొండి ప్రభుత్వంలో చలనం తీసుకు రావాలని కోరుతూ ఆత్మాహుతికి యత్నించాడు. 2009 నవంబరు 29న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చౌరస్తాలో కేసీఆర్ అరెస్టుకు నిరసనగా జరిగిన ధర్నాలో ఒంటిమీద పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఉద్యమ జ్వాలను రగిల్చి అగ్నికి ఆహుతి అవుతూ జై తెలంగాణ అంటూ నినదించాడు. నీవైనా న్యాయం చేయమంటూ అంబేద్కర్ విగ్రహాన్ని వేడుకున్నాడు. కాలిన గాయాలతో కామినేని, యశోద, ఉస్మానియాతో పాటు చివరకు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 3, 2009 న రాత్రి 10.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచాడు. ఐదు రోజుల పాటు మత్యువుతో పోరాడుతూ



కూడా తెలంగాణ స్మరణ చేశాడు. బతికితే తెలంగాణ కోసం మళ్లీ చావడానికైనా సిద్ధమన్నాడు. ఎగిసే మంటల్లో బూడిదవుతుంటే టీవీల్లో చూసిన నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల గుండెలు రగిలాయి. ప్రతి ఒక్కరూ ఉద్యమానికి ఉద్యుక్తులయ్యేలా శ్రీకాంతచారి ఉద్యమజ్వాల రగిలించాడు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసి అమరుడైన శ్రీకాంతచారి తెలంగాణ ప్రజలందరి గుండెల్లో త్యాగానికి ప్రతి రూపంగా శాశ్వతంగా నిలిచిపోయాడు.

### 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో..

## భారత్ ఉండాలి


### నేడు భారత స్వాతంత్ర్య దినోత్సవం
### తన సందేశాన్ని వెలువరించిన భారత రాష్ట్రపతి ముర్మ
### దేశ జీడీపీ ఏటా పెరుగుతోందని వెల్లడి
### మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని స్పష్టీకరణ

ఢిల్లీ: ఆగస్టు 15 భారత స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ తన సందేశాన్ని అందించారు. భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం ఈ విషయాన్ని మరోసారి గుర్తు చేస్తుందని తెలిపారు. త్రివర్ణ పతాకాన్ని చూస్తే మన హృదయం ఉప్పొంగుతుందని వివరించారు. "భారతదేశ జీడీపీ ఏటా పెరుగుతోంది. గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు అనేక కార్యక్రమాలు రూపొందించడం జరిగింది. ఆదివాసీల అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నారు. మన మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు మహిళలు సిద్ధపడుతున్నారు. ఈ ఏడాది చంద్రయాన్-3 ప్రయోగం చేపట్టాం.



చంద్రయాన్-3 జాబిల్లిపై కాలు మోపే ఘడియ కోసం ఆసక్తిగా ఎదురు చూ స్తున్నాం. పర్యావరణ పరిరక్షణ కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాం. సౌర, పవన విద్యుదుత్పత్తి పెంచే కార్యక్ర మాలు చేపట్టాం. 2047 లోగా అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో భారత్ ఉండాలి" అని ముర్మ తన సందేశంలో పేర్కొన్నారు.

## ప్రజానాడి




## 'వీకెండ్ మస్తీ'ని విజయవంతం చేయాలి : మంత్రి గంగుల

కరీంనగర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి పై నిర్వహించనున్న 'వీకెండ్ మస్తి' సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని మం త్రి గంగుల కమలాకర్ కోరారు. కేబుల్ బ్రిడ్జి వద్ద ఏర్పాట్లను మంత్రి సోమవారం పరిశీలించారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మేయర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఇతర అధికారుల తో కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్షించారు. కేబుల్ వంతెనపై శని, ఆదివారాల్లో వీకెండ్ మస్తి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం నుంచి కార్యక్ర మాన్ని ప్రారంభించనుండగా.. ప్రజలకు ఎలాంటి ఇబ్బం దులు కలుగకుండా చర్యలు తీసుకోవా



లన్నారు. కేబుల్ వంతెన ప్రారంభోత్సవం రోజున నిర్వహించిన కార్యక్రమాలను మరిపించేలా.. ప్రజలకు ఆనందంతో పాటు ఉత్సాహాన్ని కలిగించేలా సా ంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఫుడ్ స్టాళ్లు ఇతర ఏర్పాట్లు జరగాలని సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు.

## తెలంగాణలో మూడు రోజులు వానలు..



హైదరాబాద్: రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ తీరంలో బంగాళాఖా తంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, మయన్మార్, బంగ్లాదేశ్ దగ్గర ఉన్న మేఘాలను ఆకర్షిస్తుందని, ఆయా మేఘాలు తెలుగు రాష్ట్రా లపై ఆవరించి ఉన్నాయని తెలిపింది. సోమవారం నుంచి మూ డ్రోజుల పాటు తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేస్తున్నది. హైదరాబాద్, మల్కాజిగిరి, యాదాద్రి-భువనగిరి, సిద్దిపేట, నల్లగొండ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆవర్తనం కారణంగా ఏపీలోనూ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలపై ఆవర్తన ప్రభావం ఉంటుందని, అక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది

## జమ్మికుంట విలేఖరులకు విలేకరులకు ఇండ్ల స్థలాలు



**జమ్మికుంట ఆగస్ట్ 14 (ప్రజా మంటలు) :**
జమ్మికుంట పట్టణ పాత్రికేయులకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి కే సీ ఆర్, మంత్రి గంగుల కమలాకర్, స్థానిక ఎం ఎల్ సీ పాడి కౌశిక్ రెడ్డి లకు చిత్ర పటానికి, గాంధీ చౌరస్తా వద్ద విలేకరులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు మనోహర్ రావు , తదితర నాయకులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమం లో విలేకరులు పల్లె కుష్ కుమార్,మధుసూదన్ రెడ్డి,రామకృష్ణ, సదానందం,సురేష్,శేఖర్,రాజేష్ మూల తిరుపతి గౌడ్ శ్రీరామ్ రెడ్డి తదిత పాత్రికేయులకు పాల్గొన్నారు.

## మండల తాసిల్దార్లను కలిసిన ఉమ్మడి మేడిపల్లి ప్రజాప్రతినిధులు



**మేడిపల్లి ఆగస్ట్ 14 (ప్రజా మంటలు) :**
మేడిపల్లి, భీమారం మండలాకు నూతనంగా వచ్చిన ఏం ఆర్ వో లను మేడిపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వంగ వెంకటేశం, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్ గారు ఆది రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, స్వాగతం తెలిపారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయండి - సాధన కమిటీ జేఏసీ డిమాండ్



**సికింద్రాబాద్, ఆగస్ట్ 14 ( ప్రజామంటలు) :**
రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ చొరవ తీసుకొని రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన కమిటీ జేఏసీ కోరింది. ఆదివారం సికింద్రాబాద్ సీతాఫల్మండి లోని నోముల కన్వెన్షన్ హాల్ లో ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య జేఏసీ నేతలు మాట్లాడుతూ, అన్ని కులాలలో లాగానే ఆర్యవైశ్యుల్లోనూ పేదవాళ్ళు ఉన్నారని వారి సంక్షేమ కోసం ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. అలాగే నిరుపేద వైశ్య సోదరుల కోసం వైశ్య బందు కూడా ప్రవేశపెట్టాలని వారు కోరారు. తమ రెండు న్యాయమైన డిమాండ్లను నెరవేరిస్తే, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఆర్యవైశ్యులంతా మద్దతునిచ్చి భారీ మెజార్టీతో మరోమారు అధికారంలోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సికింద్రాబాద్ జేఏసీ కన్వీనర్ విశ్వేశ్వరరావు నాయకులు విశ్వజ్యోతి, చకినం రాజు, మురళీధర్, శ్రీనివాసరావు, వినయ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పిర్యాదు పట్ల స్పందిస్తాం : జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్



**జగిత్యాల ఆగస్ట్ 14 (ప్రజా మంటలు) :**
గ్రీవెన్స్ డే ద్వారా వచ్చే ప్రతి పిర్యాదు పై స్పందించి, బాధితులకు న్యాయం అందించే విధంగా పని చేయడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ భాస్కర్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన 31అర్జీదారుల నుండి ఫిర్యాదులు, ఆర్జీలు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# దీటైనా వ్యక్తిని నేనే,,, నాకే బి ఆర్ ఎస్ టికెట్ ఇవ్వాలి

## -పోనగంటి మల్లయ్య



**జమ్మికుంట ఆగస్ట్ 14 (ప్రజా మంటలు ) :**
హుజూరాబాద్ నియోజక వర్గంలోనీ ఇల్లందకుంట మండల కేంద్రం లో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు పొనగంటి మల్లయ్య అధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి, ఈటల కు దీటైనా వ్యక్తిని నేనే,,, నాకే బి ఆర్ ఎస్ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్లయ్య మాట్లాడుతూ, 1985 నుండి రాజకీయ జీవితం ప్రారంభించి ప్రజలకు సుపరిచుతినిగా ఉండి, అనేక వర్గాల, కార్మికుల సంఘాలకు గౌరవ అధ్యక్ష పదవిలో ఉంటూ, గౌరవ మంత్రి కీ.శే. ముద్దసాని.దామోదర్ రెడ్డి హయాంలో సర్పంచ్ గా, తదనంతరం ఎంపి టి సి గా, మార్కెట్ కమిటీ చైర్మన్ గా ప్రజలకు సేవలు అందించాను అని తెలిపారు.
జనం కోసం బ్రతికే వ్యక్తినే గానీ జనం మీద బ్రతికే వ్యక్తిని కాదు అని అలాగే రాత్రనక పగలనక ప్రజల సమస్యలను తన సమస్యలు గా భావించి ప్రతీ సమస్యను పరిష్కరించి ఏ సమయానికి ఫోన్ చేసిన కూడా వారికి అందుబాటులో ఉండి , ప్రజల మనసులో మంచి స్థానం సంపాదించి పెట్టుకున్నానని, ఈటెల రాజేందర్ బి ఆర్ ఎస్ పార్టీ వీడిన నాడు కూడా పార్టీకి తోడుగా ఉండి, వెనకడుగు వేయకుండా ప్రజలను, పార్టీ కార్య కర్తలను ముందుండి నడిపించి తన వంతు కర్తవ్యం ను నెరవేరచానని, హుజూరాబాద్ నియోజక వర్గ ప్రజల ఆశీస్సులతో గౌరవ అధిష్ఠానం తనకు ఎలాగైనా పార్టీ తరుపున ఎం ఎల్ ఏ టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎదుటి పోటీ దారుడు ఎంతటి వారైనా వారిని ఓడించి, హుజూరాబాద్ గడ్డ మీద గులాబీ జెండా ఎగుర వేసి, ముఖ్య మంత్రికి బహుమతిగా ఇస్తానని పేర్కొన్నారు. అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కూడా పార్టీ కి అంకితభావంతోనే పని చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో అప్పాల.రమేష్, రెనికుంట్ల.సారయ్య, రావుల.ఎల్లయ్య, రాంరెడ్డి, సది, రాజేందర్, అప్పల.విజయ్, అప్పల.సదేష్, పొనగంటి. సురేష్ (జెమిని), కాసర్ల సతీష్, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబర్ నేరం పై తక్షణమే పిర్యాదు రూ.2.54 లక్షల రికవరీ

## - అమౌంట్ రికవరీ కాపీని బాధితునికి అందజేత - సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - జిల్లా ఎస్పీ శ్రీ ఎగ్గడి భాస్కర్

**జగిత్యాల ఆగస్ట్ 14 (ప్రజా మంటలు ) :**
మెగా కంపెనీలో సూపర్వైజర్ గా పని చేస్తున్న వినోద్ కుమార్ తన బ్యాంక్ అకౌంటులో మినిమమ్ బ్యాలెన్స్ మెయింటైన్ చేయనందున క్లోజ్ చేస్తున్నామని మెసేజ్ రావడం వల్ల గూగుల్ లో బ్యాంక్ కస్టమర్ కేర్ నెంబర్ గురించి తెలుసుకొని. ఆ నెంబర్ ఫోన్ చేయడం ద్వారా ఆ నెంబర్ నుండి మాట్లాడిన సైబర్ నేరగాడు వినోద్ ను గూగుల్ ప్లే స్టోర్ ను%శీ%డి క్విక్ సపోర్ట్ అనే అప్లికేషన్ డౌన్లోడ్ చేయవలసిందిగా తెలిపాడు. వెంటనే ఆ యొక్క యాప్ డౌన్లోడ్ చేసిన వినోద్ ఇదే మొబైల్ నెంబర్ తన యొక్క ఇంకో బ్యాంక్ అకౌంట్ కి లింక్ ఉండటం వల్ల ఆ యొక్క అకౌంట్ లో ఉన్న 4,70,000/- రూపాయలను సైబర్ నేరగాడు క్యూబిక్ యాప్ ను ఉపయోగించి విత్ డ్రా చేసుకోవడం జరిగింది. వెంటనే మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే 1930కి కాల్ చేసి, వెల్గటూర్ పోలీస్ స్టేషన్ సంప్రదించగా కేసు నమోదు చేసి, కేసును సైబర్ టీంకు అప్పగించారు. సైబర్ టీం కేసును ఛాలెంజింగ్ గా తీసుకొని 2,54,000/- రికవరీ చేసి, జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బాధితునికి అమౌంట్ రికవరీ కాపీని అందజేశారు. సైబర్ నేరం చెదనలో కీలక పాత్ర వహించి, బాధితుడికి డబ్బులను రికవరీ చేయడం లో కీలక పాత్ర పోషించిన ఐటీ సెల్ ఎస్.ఐ దినేష్ , ఐటీ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..సైబర్ నేరగాళ్ళ వలలో పడి ఎవరైనా నగదును నష్టపోతే వెంటనే సైబర్ హెల్ప్లైన్ నంబర్ 1930 లేదా డయల్ 100 కు



చేయవచ్చని లేదా(%షఞ.ఎఎవతీఎతీఅఎవ.ర్రశీజ.అఅ%) వెబ్ సైట్ ద్వారా సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో ఫిర్యాదు చేయవచ్చని, తక్షణ ఫిర్యాదుతో పోగొట్టుకున్న నగదును తిరిగి పొందడానికి అవకాశం ఉంటుంది అన్నారు. ఫిర్యాదు అందిన తరువాత సంబంధిత పోలీసు అధికారులు త్వరితగతిన పరిశీలించి, ధృవీకరించి అట్టి విషయాన్ని బ్యాంకులకు మరియు ఏ వాలెట్ ద్వారా నగదును కోల్పోయారో ఆ యాజమాన్యానికి పంపి కోల్పోయిన నగదును నేరగాళ్లకు చెందకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పి భాస్కర్ తెలిపారు.

# షటిల్ విజేత సికింద్రాబాద్ షటిల్ రైడర్స్



**సికింద్రాబాద్, ఆగస్ట్ 14 ( ప్రజామంటలు) :**
నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ సౌజన్యంతో చిలకలగూడ నాగులూరి జీహెచ్ఎంసీ పార్కులో నిర్వహించిన ఇన్విటేషనల్ షటిల్ బాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్లో సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ జట్టు విజేతగా నిలిచింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నాలుగు రోజులుగా మూడు కేటగిరిల్లో నిర్వహించిన షటిల్ డబుల్స్ బాడ్మింటన్ టోర్నమెంట్లో ఆదివారం ఫైనల్ పోటీలు జరిగాయి. పురుషుల విభాగం ఫైనల్లో రాజీవ్, ప్రవీణ్లు 21%--%17 తేడాతో జితేంద్ర, స్వామిలపై విజయం సాధించి విజేతగా నిలిచారు. మహిళల విభాగంలో సువర్ణ, హసినీ జంట నీలిమ, నస్రీన్పై, యంగ్బాయ్స్ విభాగంలో హర్ష, శశాంక్లు ప్రసాద్, లక్కీలపై విజయం సాధించి విజేతలుగా నిలిచారు. ఫెయిర్ప్లే అవార్డును రంగ శ్రీనివాస్, జనార్ధన్రెడ్డి, మహేష్లు, బెస్ట్ పవర్స్మాష్ అవార్డును డాక్టర్ బట్టు, బెస్ట్టీం అవార్డును చంద్రశేఖర్, విజయ్లు గెలుచుకున్నారు. రిఫరీలుగా అనీల్ బెనహర్, బిట్ల రఘునందన్, రాంబాబు, స్వామి, శేఖర్, ప్రవీన్, సందీప్లు పాల్గొన్నారు. ఆసక్తికరంగా జరిగిన ఫైనల్ పోటీలను వీక్షించేందుకు స్థానికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నాగులూరి జీహెచ్ఎంసీ పార్కు ప్రాంగణంలో ఆదివారం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ ఛైర్మన్ నాగులూరి సాయిబాబా ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు8 బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శారీరక, మానసిక ధృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయన్నారు. యువత క్రీడలపై మరింత దృషి సారించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని,అందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో అభినవ్నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజేష్గౌడ్,ఎలక్ట్రికల్ ఏడీ మహేష్లతోపాటు పద్మారావునగర్ రాకెట్ రైడర్స్, పద్మారావునగర్ షటిల్ గ్రూప్, అభినవ్నగర్ కాలనీ బాడ్మింటర్ అసోషియేషన్ సభ్యులు శ్రీధర్, కుషాల్, కృష్ణయాదవ్, మధుసూదన్రెడ్డి, లింగం, చంద్రశేఖర్, పాపారావు, శ్రీనివాస్, డాక్టర్ బట్టు, నరోత్తమ్, విజయ్, సాక్షిశేఖర్, మురళీ, స్వామి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

## -ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

**జగిత్యాల ఆగస్ట్ 14 (ప్రజా మంటలు) :**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ–తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా వృద్ధుల, దివ్యంగుల,ట్రాన్స్ జెండర్ ఆరోగ్య సంరక్షణ కోసం మొబైల్ మెడికేర్ యూనిట్ పేరిట ఉచిత వైద్య చికిత్స సంచార వాహనం ద్వారా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంలో రాయికల్ పట్టణంలో ఇందిరా నగర్, వడ్డెర కాలనీ లో ఈ ఉచిత వైద్య చికిత్స శిబిరాన్ని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ప్రారంబించారు. ఈ వాహనం లో ఎసి సౌకర్యంతో కూడిన 3 చికిత్స అందించే బెడ్ చేర్స్, ఆక్సిజన్ కిట్, రక్త నిధి ఫ్రీజర్ తో కూడిన ఆధునిక వైద్య సౌకర్యాలతో వాహనాన్ని రూపొందించారని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో తాను రెడ్ క్రాస్ వ్యవస్థాపక సభ్యుడిగా, రోటరీ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, వృద్దులకు,దివ్యంగులకు,ట్రాన్స్ జెండర్ ల సౌకర్యార్థం రెడ్ క్రాస్ సొసైటీ అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మార్గదర్శకంలో రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి మంచాలకృష్ణ, రెడ్ క్రాస్ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్ పర్యవేక్షణలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. జగిత్యాల,రాయికల్ ప్రబుత్వ ఆసుపత్రిలలో వైద్యులు, వైద్య సౌకర్యాలు



పెరిగాయి అని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలు ఉపయోగించు కోవాలని,జగిత్యాల ప్రబుత్వ ఆసుపత్రిలో నలుగురు కంటి వైద్యులు ఉన్నారని వారి సేవలు ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ మోర హనుమండ్లు,వైస్ చైర్మన్ గంద్ర రమదేవి, ఏ ఏం సి ఛైర్మెన్ రాణి, కౌన్సిలర్ సాయి, పాక్స్ ఛైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి,డా.తేజ,మాజీ ఏఏంసి ఛైర్మెన్ ఉదయ శ్రీ,కౌన్సిలర్ లు,కో ఆప్షన్ సభ్యులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకుశంఖు స్థాపన చేసిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**సరూర్ నగర్ ఆగస్ట్ 14 (ప్రజా మంటలు) :**
సరూర్ నగర్ డివిజన్, విజయపురి కాలనీలో 5 కోట్ల 98 లక్షల రూపాయలతో నిర్మించే ట్రంక్ లైన్ నిర్మాణ పనులకు, విజయపురి కాలనీలో 31 లక్షల రూపాయలతో నిర్మించే సిసి రోడ్ నిర్మాణ పనులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి గారు మాట్లాడుతూ,ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో గ్రేటర్ హైదరాబాద్ నగరం విశ్వనగరంగా మారుతుందని, 9 ఏళ్ల కిందట ఎల్ బి నగర్ ప్రాంతం ఎట్లుండెనో, ఇపుడు ఎలా మారిందో చూస్తేనే నగర అభివృద్ధి తెలుస్తుందన్నారు. అండర్ పాస్ లు,ఫ్లై ఓవర్ లు, వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి తదితర కార్యక్రమాలతో రానున్న కాలంలో పెరగనున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేపట్టడం జరుగుతుందన్నారు. ఇంకా, మెట్రో విస్తరణతో అభివృద్ధి శరవేగంగా జరగనుందని,శివారు ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు పెరుగుతాయన్నారు. నాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు, తద్వారా వరద నీరు సాఫీగా వెళ్ళటానికి అవకాశం ఏర్పడుతుందని, ఒక ప్రత్యేక విజన్ తో గ్రేటర్ హైదరాబాద్ తో పాటు శివారు మునిసిపాలిటీలు,కార్పొరేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని మంత్రి సభిటా ఇంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి పాల్గొన్నారు.

## %నల్ల నరసింహులు స్మారక భవనానికి స్థలం కేటాయించాలి



**జనగామ ఆగస్టు 14 (ప్రజామంటలు) :**
పద్మశాలి ముద్దు బిడ్డ తెలంగాణ టైగర్ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్ల నరసింహులు స్మారక భవనానికి స్థలం కేటాయించాలని, వారి జయంతి, వర్ధంతి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి నిర్వహించాలని, హైదరాబాద్ టాంక్ బండ్ పై విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ, చేనేత కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అదనపు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని ఇచ్చారు. తదనంతరం చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంగళంపల్లి జనార్ధన్ మాట్లాడుతూ నాటి నిజాం నిరంకుశ పాలన కు రజాకార్ల గుండాల హత్యలు అరాచకానికి విసునూర్ రామచంద్ర రెడ్డి జానకమ్మ రాక్షస పాలన వెట్టి చాకిరి నిర్మూలనకు కృషిచేసిన నల్ల నరసిములు ఎల్లప్పటికి చీరస్మరణీయుడాని అన్నారు. ప్రజల మాన ప్రాణాలను కాపాడిన పోరాడిన తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన యోధుడు నల్ల నరసింహులు నాటి బ్రిటీష్ ప్రభుత్వం తన పొరాట పటిమకు తెలంగాణ టైగర్ బిరుదు పొందిన ఏకైక నాయకుడు నల్ల నర్సింహులు ని అన్ని రకాల గుర్తింపు నిచ్చి వారి స్మారక భవనం నిర్మాణం కోసం తప్పనిసరి భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం శోచనీయమని జనార్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే వారి సేవలను గుర్తు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అది సాయన్న, పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, శివరాత్రి స్వామి, కూతురు చింతకింది అరుణ పాల్గొన్నారు.

## బేడ బుడగ జంగాలను గుర్తించిన పార్టీకే మా మద్దతు

### - 5 ఎమ్మెల్యే,2 ఎంపీ సీట్లు ఇవ్వాలని డిమాండ్



**జనగామ ఆగస్టు 14 (ప్రజామంటలు) :**
బేడ బుడగ జంగాల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి,బచ్చన్నపేట మండల అధ్యక్షుడు సిరిపాటి రామదాస్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలో బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పత్రి నర్సింహులు, జిల్లా అధ్యక్షుడు పర్వతం యాదగిరి,రాందాస్ లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన బేడ బుడగ జంగాలకు ఏ ప్రభుత్వం న్యాయం చేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గాని,కేంద్ర ప్రభుత్వం గాని ప్రత్యేక చొరవ తీసుకొని బుడగ జంగాలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. 40 లక్షలకు పైగా జనాభా కలిగి ఉన్న మమ్మల్ని ఏ రాజకీయ పార్టీ గుర్తింపు ను ఇవ్వడం లేదని,బేడ బుడగ జంగాలను గుర్తించిన పార్టీ కే మా మద్దతు ఉంటుందని, జంగాలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని రాబోయే ఎన్నికల్లో జంగాలకు 5 ఎమ్మెల్యే సీట్లు,2 ఎంపీ సీట్లు కేటాయించాలని లేకుంటే ఎలక్షన్ ను బైకాట్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల వెంకటయ్య,వానరాశి యాదగిరి,సిరిపాటి యేషయ్య,పత్రి తిరువాటి, తూర్పాటి ఎల్లయ్య, సిరిపాటి భీమయ్య, నర్సయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## ఖిల్లా ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ ఇంచార్జ్ చైర్ పర్సన్ గోలి శ్రీనివాస్



**జగిత్యాల ఆగస్ట్ 14 (ప్రజా మంటలు) :**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఖిల్లా యందు నిర్వహిస్తున్న దృష్ట్యా వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ గోలి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ వేడుకలకు ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని, పారిశుధ్య పనులు కూడా చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. వీరి వెంట మున్సిపల్ కమిషనర్ అనిల్ బాబు, డి.ఈ రాజేశ్వర్, కౌన్సిలర్లు పంబల రామ్ కుమార్, బొడ్ల జగదీష్, తోట మల్లికార్జున్, కోరే గంగమల్లు, అధికారులు శానిటరీ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి, అశోక్, రాము, నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

## హెచ్ 2 హెచ్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థికి చేయూత



**జనగామ ఆగస్టు 14 (ప్రజామంటలు) :**
హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో వైద్య విద్యార్థి సృజన్ శీలం అనే ఎంబిబిఎస్ మూడోవ సంవత్సరం సిద్దిపేట్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చదువుతున్న వైద్య విద్యార్థికి 15వేల ఆర్థిక సహాయం అందించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు.మూడే రవి నాయక్ మాట్లాడుతూ దాత గుజారి శ్రీనివాస్ డివిజనల్ ఇంజనీర్ విద్యుత్ శాఖ వారి సహకారంతో సృజన్ కి మొదటి, రెండవ సంవత్సరానికి ఆర్థిక సహాయం అందజేశారు,3సంవత్సరానికి గాను ఈ రోజు 15 వేల రూ ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. రాబోయే రోజుల్లో సృజన్ ఐఎంబీబీఎస్ పూర్తి అయ్యేంతవరకు ఈ ఆర్థిక సహాయాన్ని నిరంతరం కొనసాగుతుందని దాత శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ మూడే లక్ష్మీదేవి , శ్రీనివాస్, లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు.

## %అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షునిగా రాచపెల్లి శ్రీకాంత్



**జమ్మికుంట (ప్రజా మంటలు )**
:తెలంగాణ అంబెద్కర్ యువజన సంఘం జమ్మికుంట మండలం లోని విలాసాగర్ గ్రామం లో మండల అధ్యక్షుడు రత్నం మహేష్ ఆధ్వర్యంలో గ్రామం లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. గ్రామ అధ్యక్షులు గా రాచపెల్లి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు రాచపెల్లి సుమన్, రాచపెల్లి చిరంజీవి, ప్రధాన కార్యదర్శి గా రాచపెల్లి రాజా శేఖర్, సంయుక్త కార్యదర్శి రాచపెల్లి గణేష్, చంద్రగిరి కుమార్, చంద్రగిరి రజినీకాంత్, కోశాధికారి రాచపెల్లి సమ్మయ్య, ప్రచార కార్యదర్శి రాచపెల్లి కుమారస్వామి, రాచపెల్లి రాజయ్య, రాచపెల్లి ఎల్లయ్య కార్యవర్గ సభ్యులు సందగల్ల రవి,రాచపెల్లి సంపత్,రాచపల్లి రాజ్ కుమార్, రాచపెల్లి అంకుస్, రాచపల్లి సంతు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి బత్తుల పాండు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మైస సాంబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచపెల్లి వంశీ, మండల నాయకులు మోలుగురి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## %దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి



**జనగామ ఆగస్టు 14 (ప్రజామంటలు) :**
ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శివ లింగయ్య ఆదేశించారు, జనగామ జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి 4, ఎస్సీ కార్పొరేషన్ 1, విద్యాశాఖ అధికారి 3, టెక్స్టైల్ 1, ఇరిగేషన్ 1, లీడ్ బ్యాంకు 1, మున్సిపల్ 2, ఎంపీడీవో రఘునాథపల్లి 1, ప్రాజెక్ట్ డైరెక్టర్ హౌసింగ్ 2, ఎస్సీ వెల్ఫేర్ 1, రెవెన్యూ శాఖకు సంబంధించి 21, మొత్తం అన్ని శాఖలు కలిపి (45) దరఖాస్తులు వచ్చాయని, జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పి.రవీందర్, సూపరింటెంట్ ఎతే శాంఅలీ, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా మహాత్మ గాంధీ చలనచిత్ర ప్రదర్శన



**జనగామ ఆగస్టు 14 (ప్రజామంటలు) :**
భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రోజు నుండి 24వ తేదీ వరకు మహాత్మా గాంధీ చలనచిత్ర ప్రదర్శన జిల్లాలో ప్రదర్శించుటకు ఏర్పాటు చేశామని, ఈ రోజు ఉదయం 8 గంటలకు జిల్లాలోనీ (5) సినిమా థియేటర్లలలో ప్రత్యేక షోలు ప్రదర్శించడం జరిగిందని జనగామ దేవి థియేటర్లో (703) మంది విద్యార్థులు స్వర్ణ కళామందిర్ లో (458) మంది విద్యార్థులు, కృష్ణ కళామందిర్ (570) మంది విద్యార్థులు, స్టేషన్ ఘనపూర్ మహాలక్ష్మి థియేటర్ (275) మంది విద్యార్థులు, పాలకుర్తి ప్రియ థియేటర్ లో (430) మొత్తం జిల్లా వ్యాప్తంగా (2436) మంది విద్యార్థులు ఈ రోజు మహాత్మ గాంధీ చలనచిత్రాన్ని తిలకించాలని జనగామ జిల్లా కలక్టర్ సి.హెచ్.శివలింగయ్య తెలిపారు, చిత్ర ప్రదర్శన జరుగు సంబంధిత థియేటర్లలో ప్రత్యేక అధికారులను నియమించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు, కృష్ణ కళామందిర్ లో విద్యార్థులతో కలిసి ఆయన మహాత్మా గాంధీ చలన చిత్రాన్ని తిలకించారు. ఈ చిత్ర ప్రదర్శన కార్యక్రమంలో జనగామ ఆర్డీవో మురళీకృష్ణ, డీఈవో రాము, సిపిఓ ఇస్మాయిల్, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్,అసిస్టెంట్ సెక్రటరీ రామారాజు, నోడల్ ఆఫీసర్స్, తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారికి ఆక్షణం మీరే దేవుళ్ళు

### - డాక్టర్ జాబ్ కాదు గౌరవప్రదమైన వృత్తి హెల్త్ మినిస్టర్ టి.హరీష్ రావు

**సికింద్రాబాద్, ఆగస్ట్ 14 ( ప్రజామంటలు ) :**
డాక్టర్ అనేది ఒక ఉద్యోగం కాదని, ఇది ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే గొప్ప గౌరవప్రదమైన వృత్తి అని, ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడే రోగికి ఆ క్షణం మీరే దేవుళ్ళని రాష్ట్ర ఆర్థిక, వైద్య శాఖ మంత్రి టి.హరీష్ రావు అన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ కి చెందిన 2017 బ్యాచ్ కు చెందిన 200 మంది మెడికల్ స్టూడెంట్స్ గ్రాడ్యుయేషన్ సెర్మనీ ఆదివారం రాత్రి గాంధీ కాలేజీ ఆవరణలోని గ్రౌండ్ లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. పీహెచ్సీ, బస్తీ, పల్లె దవాఖానల్లో పనిచేయాలని, ప్రభుత్వం ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి వైద్య విద్యను అందిస్తుందన్నారు. సమాజంలో ఎన్నో వృత్తులు, ప్రొఫెషన్లు ఉంటాయని, కాని డాక్టర్లు, సైనికులు, రైతులకు మాత్రమే అరుదైన గౌరవం ఉంటుందన్నారు. తల్లి జన్మనిస్తే, ఆపదలో పున:జన్మను ఇచ్చేది మాత్రం డాక్టర్లు అని అన్నారు. దేశంలోనే తెలంగాణ ఎంబీబీఎస్ సీట్ల ర్యాంకింగ్ లో ఫస్ట్ ప్లేస్ లో ఉందని, పీజీ సీట్లలో సెకండ్ ప్లేస్ లో ఉందని మంత్రి చెప్పారు. గతంలో రాష్ట్రంలో మొత్తం పీజీ మెడికల్ సీట్లు 1183 ఉంటే ఆ సంఖ్యను తెలంగాణ ప్రభుత్వం వచ్చాకా 2890 కు పెంచామని, త్వరలో మరిన్ని సీట్లను పెంచి, దేశంలోనే పీజీ సీట్లలో కూడ ఫస్ట్ ప్లేస్ ను తెస్తామన్నారు. నిమ్స్ లో రోబోటిక్ సర్జరీ ఈక్విప్ మెంట్ ఇచ్చామని, దీనివలన బెస్ట్ డాక్టర్స్ గా తయారు అవుతున్నారని ఆయన తెలిపారు. రాబోవు కాలంలో వరంగల్ తో పాటు హైదరాబాద్ లో నాలుగు సూపర్




స్పెషాలిటీ ఆసుపత్రుల ( టిమ్స్) అటానమస్ గా ఏర్పాటుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని, అందులో సూపర్ స్పెషాలిటీ కోర్సులను కూడ ప్రవేశపెడతామన్నారు. ఆర్గాన్ ట్రాన్స్ప్లాంట్స్ లో మన రాష్ట్రం సక్సెస్ రేట్ ఎక్కువగా ఉందన్నారు. వైద్యం కోసం విదేశాల నుంచి ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన స్టూడెంట్స్ కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. వారి తల్లిదండ్రులను అభినందించారు. మెరిట్ సాధించిన పలువురు ఎంబీబీఎస్ స్టూడెంట్స్కు మంత్రి గోల్డ్ మెడల్స్ ను, ఎంబీబీఎస్ పట్టాలను అందచేశారు. కార్యక్రమంలో డీఎంఈ డా.కే.రమేశ్ రెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు, గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఆయా డిపార్ట్మెంట్ ల హెచ్.ఓ.డీ లు, డాక్టర్లు పాల్గొన్నారు

## పోగుల లక్ష్మీ రాజం హత్య కేసు సిబిఐకి అప్పగించాలి

### - ముదిరాజ్ మహాసభ నాయకుల డిమాండు





**కోరుట్ల టౌన్ ఆగష్టు 14 (ప్రజా మంటలు) :**
కోరుట్ల పట్టణంలో 9వ వార్డ్ కౌన్సిలర్ భర్త లక్ష్మి రాజం హత్య కు నిరసనగా కోరుట్ల ఐలాపూర్ రోడ్డు పెద్దమ్మ దేవాలయం నుండి బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం మీదుగా కార్గిల్ చౌక్ వరకు లక్ష్మి రాజం ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలు పట్టుకొని ముదిరాజ్ మహా సభ ఆధ్వర్యంలో వేల సంఖ్యలో బారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ లక్షిరాజం హత్య ఒక పథకం జరిగిందని సుపారి తీసుకొని హత్య చేశారని దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ కేసును సిబిఐ కి అప్పగించి నిందితులను తక్షణమే పట్టుకోవాలని డిమాండ్ చేశారు. లక్ష్మి రాజం భార్య కౌన్సిలర్ పోగుల ఉమారాని మాట్లాడుతూ ఈ హత్య వెనుక ఇంకా చాలా మంది ఉన్నారని వారిని బయట కు తీయాలంటే సిబిఐ కి కేసు అప్పజేపితేనే తమకు న్యాయం జరుగుతుందని అన్నారు. తర్వాత ఆమె నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.న్యాయం జరిగే వరకు నాయకులు వెన్నంటి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్ష హన్మాండ్లు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గుర్రాల మల్లేశం, జగిత్యాల జిల్లా అధ్యక్షులు నీలం పెద్దులు, పులి నర్సయ్య, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కోడి అనంతయ్య, ఉపాధ్యక్షులు బల్ల పోచయ్య, ముదిరాజ్ రాష్ట్ర నాయకులు న్యాయవాది వెలుముల రాంబాబు, జగిత్యాల పట్టణ అధ్యక్షులు జంగిలి రాజేష్, యువత విభాగం రాష్ట్ర అధ్యక్షులు పండగ బాలు, జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఉరుమడ్ల చరణ్, కోరుట్ల మండల అధ్యక్షులు ఉరుమడ్ల శ్రీనివాస్, పీసరి అశోక్, కుమార్, అశోక్ తుపాకుల బాజన్న రేండ్ల రమేష్ ,కలల భూమ సాయిలు ఎడ్ల రమేష్, కోరుట్ల మండల పట్టణ సంఘాల అధ్యక్షులు మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తదితరులున్నారు.

## విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటున్న గాంధీ చిత్రం

### - జగిత్యాల జిల్లాలో తొలిరోజు గాంధీజీ చిత్రం తిలకించిన 3,555 మంది విద్యార్థిని విద్యార్థులుజిల్లాలో మొత్తం 11 థియేటర్లలో చిత్ర ప్రదర్శన

**జగిత్యాల ఆగస్టు 14 (ప్రజా మంటలు) :**
జిల్లాలో 11 థియేటర్లలో నిర్వహించిన గాంధీజీ చిత్ర ప్రదర్శనలో వివిధ పాఠశాలల నుండి 3,555 మంది విద్యార్థిని విద్యార్థులు ఉదయం 8 గంటలకే సంబంధిత ఉపాధ్యాయులు ప్రిన్సిపల్స్ తో థియేటర్లకు విచ్చేసి అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో జాతిపిత మహాత్మా గాంధీ కి జై అనే నినాదాలతో విద్యార్థిని విద్యార్థులు గాంధీ చిత్రాన్ని వీక్షించారు. జాతిపిత మహాత్మాగాంధీ జీవిత చరిత్రను తెలియజేసే గాంధీ చిత్రాన్ని కేవలం విద్యార్థులకు మాత్రమే కాకుండా వారి తల్లిదండ్రులు, సాధారణ ప్రజలు కూడా వీక్షించే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. భారత స్వాతంత్ర వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాలలో భాగంగా ఈ నెల 14 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు సినిమా దియేటర్ లలో జాతిపిత మహాత్మాగాంధీ చలనచిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించుట. జరుగుతుంది. ఈనెల 14 వ తేదీన ప్రారంభమైన ఉచిత. గాంధీ సినిమా 15 వ తేదీన ఇండిపెండెన్స్ డే సందర్భంగా, 20 వ తేదీన ఆదివారం కారణంగా చిత్ర ప్రదర్శన ఉండదన్నారు. 16 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు చిత్ర ప్రదర్శన ఉంటుంది



జిల్లాలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ చిత్రాన్ని తిలకించి జాతీయతా భావాన్ని చాటాలి. గాంధీ చిత్రాన్ని భారతదేశంలో 30 నవంబర్ 1982న, యునైటెడ్ కింగ్డమ్లో డిసెంబర్ 3న మరియు యునైటెడ్ స్టేట్స్లో డిసెంబర్ 8న కొలంబియా పిక్చర్స్ విడుదల చేసింది . గాంధీజీ జీవితం, భారత స్వాతంత్ర్య ఉద్యమం మరియు భారతదేశంపై బ్రిటీష్ వలసపాలన యొక్క హానికరమైన ఫలితాలను చారిత్రాత్మకంగా ఖచ్చితమైన చిత్రణ అందించినందుకు ఇది అందరిచే ప్రశంసించబడింది.వి ద్యార్థులను థియేటర్ ల వద్దకు ఉచితంగా తీసుకెళ్ళి క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చడం జరిగింది.

## ప్రజావాణి అర్జీలను వేగంగా పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



**జగిత్యాల ఆగస్టు 14 (ప్రజా మంటలు) :**
కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి 37 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు సమస్యలు తలెత్తడానికి గల కారణాలు తెలుసుకొని వాటి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు ఖిలాలో మంగళవారం జరగబోవు స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయా శాఖల ద్వారా వారి కేటాయించిన విధులను క్రమశిక్షణగా పూర్తి చేసి విజయవంతంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు ఉదయం 10 గంటలకు సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ ఉంటుందని అధికారులు హాజరుకావాలన్నారు . అనంతరం ఖిలాలో జరగబోవు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను సంక్షేమ శాఖ మాత్యులు కొప్పుల ఈశ్వర్ జెండా ఆవిష్కరణతో ,పోలీసు గౌరవ వందనం, అభివృద్ధి కార్యక్రమాలు సంక్షిప్త సమాచారం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు వివిధ కార్యక్రమాలతో ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు.

## గద్దర్ కు ఘన నివాళి



**హుజూరాబాద్ ఆగస్ట్ 14 (ప్రజా మంటలు) :**
అల్వాల్ వెంకటాపూర్ లోని మహాబోధి విద్యాలయంలో ప్రజాయుద్ధనౌక గద్దర్ సమాధి వద్ద సోమవారం నాడు హుజురాబాద్ కు చెందిన ప్రముఖ తెలంగాణ గాయకుడు గద్దర్ శిష్యుల్లో ఒకరైన శనిగరం బాబ్జీతో పాటు వివిధ జిల్లాలకు చెందిన గాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఆయనను స్మరిస్తూ పాటలతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హుజురాబాద్ ప్రాంతగాయకులు పుల్ల వెంకటస్వామి, సతీష్, హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన వీరన్ననాయక్, కేడం లింగమూర్తి, గోస్కుల సుధాకర్, వరంగల్ కు చెందిన గద్దర్ మిత్రుడు సదానందం, గద్దర్ వ్యక్తిగత సహాయకునిగా పనిచేసిన రంగారెడ్డి, గాయకురాలు పంజాల రాజకుమారి తోపాటు హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాలకు చెందిన కళాకారులు పాల్గొని పాటలు పాడారు.

## భారతదేశం లో విద్యా కమిటీ లు పుస్తకం ఆవిష్కరణ



**జమ్మికుంట (ప్రజా మంటలు) :**
ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పుల్లూరి సంపత్ రావు రచించిన 'భారతదేశం లో విద్యా కమిటీలు' పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తకాలు చదవటం వలన జ్ఞానం పెరుగుతుందని, సమాజం లో ఉత్తమ పౌరుడిగా ఏదగటానికి పుస్తకాలు తొడ్పాడు తాయిఅని అన్నారు, ఈ సందర్భంగా పుస్తకం రచించిన సంపత్ రావు ని అభినందిచాడు, ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, వీణవంక ఎం పి పి ముసిపట్ల తిరుపతి రెడ్డి, బి ఆర్ ఎస్ జమ్మికుంట టౌన్ ప్రెసిడెంట్ టంగుటూరు రాజ్ కుమార్, ప్రముఖ ప్రవేట్ పాఠశాల ల కరెస్పాండంట్ లు తదితరులు పాల్గొన్నారు.




**వరంగల్ మున్సిపాలిటీ ఆఫీసు ముట్టడికి కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం ఉదయమే సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి నేలపోగుల ఎంపిటిసి గుగ్గిల్ల నర్సయ్యను హౌస్ అరెస్టు చేసి స్టేషన్ కు తీసుకెళ్లిన లింగాల ఘణపురం పోలీసులు.**

# భారత స్వాతంత్ర్యం మహోజ్వల ఘట్టం

ఎక్కడ చూసినా మువ్వన్నెల పతాకాల రెపరెపలు కానవస్తున్నాయి. అమితమైన ఆనందంతో పులకించి పోతున్న ఈ వేళ మన దేశం ఎంతటి క్షోభ అనుభవించిందో..ఎంతమంది ప్రాణత్యాగం చేశారో తెలుసు కోవాలి. ఎంతమంది ఎన్ని విధాలుగా త్యాగాలు చేశారో గుర్తించాలి. ఈ దేశం పరాయిపాలనలోనే అనేక వేల ఏళ్లు మగ్గిపోయింది. తరవాత బ్రిటిష్ వాళ్లు దీన్ని ఏలారు. నిరంకుశ పాలనలో మగ్గాం. ఎందుకు విభజనకు గురయ్యిందో.. విభజన తరవాత కూడా విడిపోయిన పాక్ దేశంలో తిష్టవేసిన ఉగ్రమూకలు ఎందుకు మనపై క్రూరంగా వ్యవహరిస్తున్నారో తెలుసుకోవాల్సిన సమయమిది. నిజానికి దేశ విభజనను ఆపాల్సిన ఆనాటి కాంగ్రెస్ నేతలు చేష్టలుడిగి చూశారు. ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించిన సుభాశ్ చంద్రబోస్ లాంటి పోరాట వీరులు అదృశ్యమయ్యారు. పటేల్ లాంటి వారిని అధికారంలో ప్రధాన పాత్ర లేకుండా పక్కనపెట్టారు. కేవలం అధికార మార్పిడి జరిగిందే తప్ప దేశం ముక్కలు కాకుండా మన నేతలు అడ్డుకోలేక పోయారు. జిన్నా పన్నిన కుట్రలో మన నేతలు పావులుగా మారారు. అలాగే పిచ్చిగీతలు గీసినట్లుగా మన దేశ సరిహద్దుల గీతను గీసిన బ్రిటిషర్లు దేశాన్ని ముక్కచెక్కలు చేశారు. మత ప్రాతిపదికన విభజనకు పట్టుబట్టి చివరకు అది పక్కకు పోయి రెండు ముక్కలు చేసేలా చేశారు. ఈ విభజన కుట్రలో బ్రిటిష్ వాళ్లకు ఆనాటి కాంగ్రెస్, ముస్లింలీగ్ పార్టీల నేతలు తొత్తులుగా వ్యవహరించారని చరిత్ర చెబుతోంది. నిజానికి ఆనాడు గట్టిగా నిలబడితే విభజన ఆగేదని చరిత్రకారులు చెబుతున్నారు. విభజన వల్ల సాధించేందేమీ లేకపోగా నిరంతరంగా యుద్ధాలు, పగలు, ప్రతీకారాలు పెరిగాయి. విభజనపై రెండువైపులా అసంతృప్తి చెలరేగింది. ఏకంగా 4నెలల వరకు అటు, ఇటు భారీగా వలసలు కొనసాగాయి. రెండు దేశాల్లోనూ మత ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో నిరంతరంగా మన దేశ చరిత్రను నేటితరం తెలుసుకోవాలి. చర్చించాలి. గాయాల నుంచి బయటపడే మార్గాలను అన్వేషించాలి. దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చి 76వసంతాలు పూర్తి కావస్తున్నాయి. ఈ శుభసందర్భంలో దేశం యావత్తు పంద్రాగస్ట్ వేడుకలను జరుపు కుంటోంది. ప్రతి ఒక్కరిలోనూ ఆనందోత్సాహాలు నిండుతున్న శుభసందర్భమిది... జాతీయ భావనతో మది పులకిస్తున్న అమృత ఘడియలివి...పక్షం రోజులు ఊరూరా, వాడవాడా మువ్వన్నెల పతాక ఠీవిగా రెపరెప లాడుతున్న సుందర దృశ్యాలు దేశమంతటా కానవస్తున్నాయి. ఏ నోట విన్నా జాతి విముక్తి పోరాటం తాలూకు రోమాంచిత ఘట్టాలపై కథనాలు వినిపి స్తున్నాయి. ఎందరో వీరుల ఆత్మార్పణతో దేశానికి దాస్యపు శృంఖలాలు తెగి, మన జీవితాల్లో కాంతులు నిండాయి...జాతీయ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలో నూ మహోత్సవాలను ఎంతో ఉత్తేజంగా నిర్వహించుకుంటున్నాం. జాతీయభావనను ఉద్దీప్తం చేసేవిధంగా ప్రజలంతా జెండాలు పూని భారతమాతకు శిరసు వంచి నమస్కరిస్తున్నారు. మన స్వాతంత్ర్య పోరాటం ఉజ్వల ఘట్టం. ఎందరో అమరులయ్యారు. ఎందరో దేశం కోసం త్యాగం చేశరాఉ. పోరాడిన వారు ఎందరో ఉన్నారు. కొందరు అనమాకంగానే మిగిలిపోయారు. లక్షలాది మంది త్యాగాలతో మనం స్వాతంత్ర్యం సాధించాం. తమ అసమాన పోరాటంతో జనం మనసులో చిరస్థాయిగా నిలిచిపోయారు. అనేకమంది వీరులు దేశం కోసం ఉరికంబం ఎక్కారు. భగత్ సింగ్, సుఖ్‌దేవ్ థాపర్, శివ్‌రామ్ రాజ్‌గురు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టి 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేశారు. కొంతమంది కాలగమనంలో కనుమరుయ్యారు. మరికొందరు చరిత్రలో లిఖించబడ్డారు. భావి తరాలకు మార్గదర్శకులయ్యారు.

అలాంటి మార్గదర్శకులు, వీరయోధులు భారతదేశ స్వాతంత్య పోరాటంలో అనేకమంది మనకు తారసపడతారు. పరాయి పీడనలో నలిగిపోతున్న భారతదేశ సర్వ స్వాతంత్ర్యం కోసం అహింసా పద్ధతిలో కొంతమంది పోరాడితే, మరికొంతమంది వీరయోధులు విప్లవ పంథాలో పోరాడారు. ప్రజలను చైతన్యవంతులను చెయ్యడం మాత్రమే కాక, దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి తమ దేశభక్తిని చాటుకున్నారు. అనేక పోరాట సంస్థల సమాహారమే భారత స్వాతంత్యోద్యమం. ఈ ఉద్యమంలో మహిళలు సైతం అనేక చారిత్రక ఘట్టాల్లో పురుషులతో సమానంగా ఎన్నో సాహసాలను ప్రదర్శించారు. స్వాతంత్ర పోరాటం అనగానే... గాంధీ, నెహ్రూ, పటేల్, నేతాజీ వంటి వారు గుర్తుకొస్తారు. కానీ భరతమాత దాస్య విముక్తి కోసం నాటి యువతీ యువకులు ఉద్యమానికి ఊపిరిగా నిలిచారు. మహిళలు బయటకు రావడానికే సందేహించే కాలంలో పోరాటాలను నడిపారు. ఎందరో త్యాగమూర్తుల ప్రాణ త్యాగాలు, వీర మరణాలతో ఆసేతు హిమాచలం నిరంకుశ బ్రిటిష్ ప్రభుత్వం నుంచి విముక్తి పొంది, స్వేచ్ఛా భారతం ఆవిర్భవించింది. ఈ చరిత్రను క్రోడీకరించాల్సిన అవసరం ఉంది. భారతదేశ చరిత్రను తిరగరాయాల్సి ఉంది. బ్రిటిషర్లు రాసిన చరిత్ర గాకుండా మనకు మనంగా మనచరిత్రను లిఖించుకోవాలి. ఈ చరిత్ర మన పాఠ్యాంశం కావాలి. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నతస్థాయి విద్యలో ఇదో భాగం కావాలి. లేకుంటే నేటి యువతకు దేశం గురించి తెలిసే అవకాశం లేకుండా పోతోంది. పాక్ అంటే ఎక్కడినుంచో ఊడిపడిందని అకుంటున్నారు. బంగ్లాదేశ్ ఎలా ఏర్పడిందో తెలియడం లేదు. కాశ్మీర్ గురించి తెలియాలి. ఇవన్నీ నేటి తరానికి తెలియజేయాలి. ఇలాంటి సందర్భాల్లో మననం చేసుకోవడం అవసరం. ఎంతమంది ఎన్నిరకాలుగా త్యాగాలు చేస్తే మనం స్వేచ్ఛావాయువులు పీల్చామో తెలుసుకోవాలి. చరిత్ర పుటల లోతులను గ్రహించాలి. అప్పుడే మన దేశానికి, చరిత్రకు అర్థం ఉంటుంది.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు....

-ఎడిటర్

# మహాత్ముని ఆంతరంగికుడు మహదేవ్ దేశాయ్

## ఆగస్టు 15...మహదేవ్ దేశాయ్ వర్ధంతి



జాతిపిత మహాత్మాగాంధీ సేవ కోసం సర్వం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి మహదేవ్ దేశాయ్. నిజానికి గాంధీకి ఆంతరంగి కుడు. ఆయన లేకుండా మహాత్ముని జీవితం గురించి సంపూర్ణంగా తెలిసేది కాదంటే అతిశయోక్తి కాదేమో. ఆయన మహాత్మా గాంధీ వ్యక్తిగత కార్యదర్శి. గాంధీకి సంబంధించిన ప్రతి విషయం స్వయంగా దేశాయే చూసేవారు. మహదేవ్ దేశాయ్ (1 జనవరి 1892–15 ఆగస్టు 1942) 1892 జనవరి 1న గుజరాత్ లోని సూరత్ జిల్లాలో సారస్ అనే గ్రామంలో ఉపాధ్యాయుడైన హరిభాయి, జన్మాబెన్ దంపతులకు జన్మించా రు.13 సంవత్సరాల వయసులో మహదేవ్ దుర్గాబెన్ ను వివాహ మాడారు.

ఆయన సూరత్ ఉన్నత పాఠశాల, ముంబయిలోని ఎల్ఫిన్ స్టోన్ కాలేజిలో చదివారు. ఆయన బి.ఎ పట్టభద్రుడు. మహదేవ్ దేశాయ్ మొదటిసారి 1915 లో గాంధీని కలిసారు. దేశాయ్ 1917లో సబర్మతీ ఆశ్రమంలో ఆయన భార్య దుర్గాబెన్‌తో పాటు చేరారు. ఆ సంవత్సరం చంపారన్ ఉద్యమం జరిగింది. ఆయన డిసెంబర్ 13,1917 నుండి ఆగస్టు 14,1942 వరకు ఆయన మరణించే తేదీ ముందు రోజు వరకు ఒక డైరీని నిర్వహించారు. దానిలో ఆయనకు మహాత్మాగాంధీ సాన్ని హిత్యం గురించి వ్రాసారు. బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని 1919లో అరెస్టు చేసినపుడు గాంధీజీ తన వారసునిగా దేశాయ్ ని ప్రకటిం చారు. దేశాయ్ మొదటిసారి 1921 లో అరెస్టు కాబడి ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష అనుభవించారు. ఆయన 25 సంవత్సరాలపాటు గాంధీజీకి వ్యక్తిగత కార్యదర్శిగా ఉన్నారు.

గాంధీజీ కంటే ముందే వేకువ జామున లేచేవారు. గాంధీతో నిరంతరం గడపేవారు. ఆరోజు జరిగిన విషయలను డైరీలో నమోదు చేసేవారు. అన్నీ తానే అయి చూసేవారు. 1920 లో మోతీలాల్ నెహ్రూ తన వార్తా పత్రిక ప్రింటింగ్ ప్రెస్‌ను బ్రిటిష్ ప్రభుత్వం జప్తు చేసిన తరువాత చేతితో వ్రాసిన సైక్లోస్టైల్ వార్తా పత్రికను బయటకు తీసుకు రావడం ద్వారా దేశాయ్ సంచలనాన్ని సృష్టించారు దేశాయ్. 1921 లో దేశాయ్‌ను తన రచనలకు ఒక సంవత్సరం కఠిన మైన జైలు శిక్ష విధించారు. దేశాయ్ 1924 లో నవజీవన్ సంపాద కుడిగా బాధ్యతలు స్వీకరించారు.

1925 నుండి గాంధీ ఆత్మకథ, యంగ్ ఇండియాలో దాని సీరియల్ ప్రచురణ కోసం ఆంగ్లం లోకి అను వాదం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం ఆయన సత్యాగ్రహ ఆశ్రమ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ అయ్యారు. సర్దార్ పటేల్‌తో కలిసి బార్డోలి సత్యా గ్రహంలో పాల్గొన్నారు. గుజరాతీ లో సత్యాగ్రహ చరిత్రను వ్రాసారు. దీనిని ఆంగ్లంలోకి ది స్టోరీ ఆఫ్ బార్డోలిగా అనువదించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఆయన్ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. గాంధీతో పాటు మిరాబెన్, దేవదాస్ గాంధీ, ప్యారేలాల్ లతో కలిసి రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. కింగ్ జార్జ్ ను కలిసేందుకు గాంధీతో పాటు వెళ్ళిన ఏకైక వ్యక్తి ఆయన. 1932 లో దేశాయ్‌ను మళ్లీ అరెస్టు చేసి గాంధీ, సర్దార్ పటేల్‌తో కలిసి జైలుకు పంపారు. 1933 లో జైలులో ఉన్న ఈ సమయంలోనే ఆయన "గీత ప్రకారం గాంధీ" పుస్తకాన్ని రాశారు. దేశాయ్ 1939 లో రాక్‌కోట్, మైసూర్ రాచరిక రాష్ట్రాలలో ప్రజల ఉద్యమాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. దేశాయ్ చివరి జైలు శిక్ష 1942 ఆగస్టు 8 నాటి క్విట్ ఇండియా ప్రకటన తరువాత జరిగింది. ఆయన 1942 ఆగస్టు 9 ఉదయం అరెస్టు చేయబడ్డారు. ఆరు రోజుల తరువాత ఆగస్టు 15 1942న గుండె పోటుతో మరణించే వరకు గాంధీతో పాటు అగాఖాన్ ప్యాలెస్‌లో ఉన్నారు. గాంధీజీ స్వయంగా దేశాయ్ భౌతిక కాయానికి స్నానం చేయించారు. ఆగాఖాన్ పాలెస్ మైదానంలో ఆయనను దహనం చేసారు. ఆ ప్రదేశంలో ప్రస్తుతం ఆయన సమాధి ఉంది. భారత తపాలా శాఖ దేశాయ్ గౌరవార్థం 1983లో తపాలా బిళ్ళపై ఆయన బొమ్మను ముద్రించింది.



రామ కిష్టయ్య సంగన భట్ల..
9440595494

# బంధాలు బాధ్యతలు



అది ఒక పల్లెటూరు. పేరు రాజనగరం. ఆ ఊళ్ళో ఒక గృహస్థు. ఆయన పేరు శంకర్. భార్య పేరు శివాని. వాళ్లకి ఐదుగురు సంతానం నల్గురు కొడుకులు, ఒకబిడ్డ.

శంకర్ ప్రభుత్వ ఉద్యోగి. పక్క ఊళ్ళో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. రాజనగరంలో కొంత భూమి,స్వంత ఇల్లు ఉన్నాయి.

పిల్లల్ని ఉన్న ఊళ్ళో పదవ తరగతి వరకు చదివించి ఉన్నత చదువులకి దగ్గర్లో ఉన్న ఒక చిన్న పట్టణానికి పంపిస్తూ ఉన్నాడు ఒకరి వెనుక ఒకరిని శంకర్ సార్.

ఆ ఐదుగురు కూడ ఒక చిన్నగది అద్దెకి తీసుకొని సమయాన్ని చక్కగ వినియోగించుకొని ఒక్కొక్కరు ఒక్కో సబ్జెక్ట్ లో ఉన్నత ఉద్యోగాలు సంపాదించుకుని తమ తమ చోట్లలో ఉన్నరు. అందరూ ప్రతి దసరా నవరాత్రులలో ఎండాకాలం సెలవుల్లో రావాలని తల్లి కోరిక. కానీ ఉద్యోగంలో ఒత్తిడి,సెలవులు దొరకక,పిల్లల చదువులు ఇట్ల ఎవరికి వారు వీలైనప్పుడు మాత్రమే ఒకరోజు కోసం తల్లితండ్రుల దగ్గరికి వచ్చిపోతుండే. ఒక్కోసారి ఏడాది కూడా గడిచిపోయేది

అట్లా ఆ ఐదుగురు పిల్లల మధ్య దూరాలు పెరిగి ఆప్యాయతలు కరువైనయి

తల్లికి ఈ విషయం లో చాలా బాధగా ఉంటుండే. తండ్రికి మాత్రం ఎటువంటి చింతా లేకుండే. ఎందుకంటే ఆయనకి ముందు నుంచి తనకి తానే పెట్టుకున్న కొన్ని కఠిన నిర్ణయాలు ఉండేది. అవే కరెక్ట్ అనే ఆయన వాదనకి ఊళ్ళో ఎదురు ఎవరూ చెప్పలేదు. చివరిదాకా ఆయనకి అట్లాగే గడిచింది.

కాలమెప్పుడూ ఒకలాగ ఉంటుందా! ఉండదు కదా!చూస్తుండగానే శంకర్ దంపతులిద్దరికీ కాళ్ళు నడవరాక, కళ్లు సరిగా కనిపించక,చెవుల వినికిడి శక్తి సన్నగిల్లి చాలా ఇబ్బందిగా ఉండసాగింది

ఇంట్లో కూడా వసతులు ఎక్కువ లేవు. వసతులేర్పాటు ఆ పల్లెటూళ్ళో అందరిముందు డబ్బు ఉన్నట్టు ప్రదర్శించడమే అన్న ఒక సిద్ధాంతంతో శంకర్ సారు ఉండేది. పిల్లలు భార్య నచ్చచెప్పే ప్రయత్నం చేస్తే వాళ్ల పైకి అరవడం వల్ల ఎందుకో ఆ ఊళ్ళో శంకర్ గారంటే అందరికీ ఉన్న గౌరవం వల్ల ఎప్పుడూ ఇంట్లో ఊళ్లోని ఎవరో ఇద్దరు ముగ్గురు కూచుండడం వల్ల పిల్లలు భార్య ఆయనకు ఎదురు చెప్పితే గౌరవం పోతుందని వాదించేవారు కాదు.

ఊరంతా నల్లానీళ్ళ సౌకర్యం ఉంటే అదికూడా పెట్టించుకోక బావి నీరు తీసుకోవడం, వెనకటి ఆ పెద్ద భవంతిలో వంటిల్లు ఒకచోట, స్నానాల గది ఇంకోవైపు, పాయిఖాన పోవాలంటే మూడు తలుపులు తీసుకొని పెరట్లో ఎక్కడో మూలగా ఉంటుంది అక్కడికి పోవాలి. పడుకునే గది ఇంకా దూరం ఇట్ల అసలు ఏ ఒక్క వెసులుబాటు ఉండదు ఆ ఇంట్లో. ఇంక ఆ ఇంట్లో తిరుగులేని మాటతో ఆ ఊళ్ళో వాళ్ళనే కాదు,భార్య పిల్లలు,చుట్టాలు శంకర్ సార్ అత్తగారి వైపు వాళ్ళు తోటి టీచర్లు అందరూ భయమో భక్తి నో తెలియకుండానే విధేయులుగా ఉంటుండే.

శంకర్ సార్ తన పిల్లలు ఏడుగురికి తమ వృద్ధాప్యపు అవస్థలు లాండ్ ఫోను ద్వారా తెలియజేశాడు. ఊళ్ళో అందరూ మొబైల్ వాడుతున్నా ఆ ఇంట్లో ఇంకా లాండ్ ఫోనే ఉంది.

పెద్ద కొడుకు తన పిల్లల చదువు ఇప్పుడు ముఖ్యమైన దశలో ఉంది తల్లితండ్రుల బాధ్యత తను తీసుకోలేని పరిస్థితి అన్నడు. రెండో వాడు ఉంచుకుంట అంటే తండ్రికి పెద్ద కొడుక్కి చెడ్డ పేరు తేవద్దు అన్న భయం. మూడో కొడుకు మీ ఇష్టం ఉంటే ఉండండి అన్నడు. నాలుగో వాడు అదే మాట అన్నడు. బిడ్డలని మీ దగ్గర ఉంటాము అని అడిగే ఆచారాలు ఇంకా బలంగా లేవు కదా మన వ్యవస్థల్లో.

అప్పుడు ఎన్నో ఏళ్ల తర్వాత తను తప్పుగా ప్రవర్తించినట్టున్న అన్న ఆలోచన కలిగింది శంకర్ సారుకి. అప్పటికి ఒకరిద్దరు దగ్గరి స్నేహితులు చెప్తూనే ఉన్నరు మాస్టారూ మీకు పెన్షన్ వస్తుంది పొలాల ఆదాయం వస్తుంది ఆ డబ్బు పిల్లలకి ఇవ్వక ముందు మీరు మీకు అన్నీ సౌకర్యాలు అందుబాటులో ఇంటిని చక్కగ మల్చుకొండి అని కానీ. . తను నిరాడంబరత అని ఒక పిచ్చి నమ్మకంతో భార్యని ఇన్నేళ్ళు కష్ట పెట్టడమే కాదు పిల్లలు కూడా బహుశా ఏ వసతులు లేవని తన చాదస్తాన్ని వేలెత్తి చూపలేక ఇంటినుంచి దూరంగా ఉన్నరని అర్థమైంది. కానీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

అదే ఊళ్ళో ఒక రెండు గదులు అన్ని వసతులూ చూసుకొని అందులోకి మా ఒక వంటమ్మాయిని పెట్టుకొని పొలం చేసే ఆసామీని రాత్రి పూట పడుకోవడానికి వచ్చే ఏర్పాటు చేసుకున్నారు. ఊళ్ళో ఉన్న డాక్టరు ఎప్పుడంటే అప్పుడు ఇంటికి తన దగ్గరున్న కాంపౌ%శీ%డర్ ను పంపేది. తల్లిని మాత్రం ఒంటరితనం బాధించేది.

అందుకే పిల్లలకి మంచి చదువు సంస్కారం ఇవ్వటమే కాదు ఖచ్చితంగా యాడాదిలో మూడు నాలుగు సార్లు ఊళ్ళో ఉన్న తలితండ్రుల దగ్గరికి పొవుడు, ఉండుడు వారి సాధక బాధకాలు చూడడం గట్టిగ చెప్పి అలవాటు చేయాలి. అప్పుడే పిల్లలకి అన్ని తరాల అవసరాలు ఏమిటివి అనే ఒక అవగాహనా అనుభవం వస్తుంది.

ప్రతి ఊళ్ళో ఇట్లాంటి గృహస్థులు ఉంటరు కదా!వారి మూర?త్వానికి నిరాడంబరం ముసుగేసుకొని. కాలం,పరిస్థితుల ప్రకారం మారడమే జీవితం.

డా. భోజన్నగారి అనసూయ.
నిజామాబాద్. 99898 22494

## ఎగురవే ఎగురవే...


ఎగురవేఎగురవే-
ఎఱ్ఱ కోటపైర్ఘుండా!
ఎవరెస్టు శిఖరమెత్తు-
ఎదురేదిలేకుండా!
పింగళిచేదిద్దిన-
పతాకంమెరయుచుండ!
బాపూజీ కలలు కన్న-
భారతావని నిండా!
అశోకుని ధర్మచక్రం-
ఆదర్శమెలఅండా!
అమరవీరుల స్వేచ్ఛ-
ఆశయాలు పండా!
రవీంద్ర, చంద్ర, ఇక్బాల్-
రాగగీతాలుండా!
రేయింబగలు రెపరెపలా-
రంజిల్లుచుండా!!

-రోజాపతి



# గద్దర్ నేపథ్యం, సామాజిక పరిణామం..




గద్దర్ మెదక్ జిల్లా, తూప్రాన్‌లో గుమ్మడి లచ్చుమమ్మ, గుమ్మడి శేషయ్య దంపతులకు 31-1-1948న జన్మించారు. గద్దర్‌కు ఒక అన్న, ముగ్గురు అక్కలు. గద్దర్ దళితుడిగా చిన్నప్పటి నుండి అనేక అవమానాలను, అనుభవాలను పొందారు. గద్దర్‌కు తల్లిదండ్రులు పెట్టిన పేరు గుమ్మడి విఠల్‌రావు. గద్దర్ తండ్రి గుమ్మడి శేషయ్యకు తూప్రాన్‌లో భూమి, వ్యవసాయం లేదు. పొట్ట చేత పట్టుకొని వలస వెళ్ళారు. నైజాం రాజ్యంలో నిజామాబాద్, నాందేడ్, ఔరంగాబాద్‌ల దాకా కుటుంబాన్ని వెంట తీసుకొని ప్రస్థానం సాగించారు. నైజాం ప్రభుత్వ గుర్తింపు పొందిన కాంట్రాక్టర్ శేషయ్య. ఔరంగాబాద్‌లో అంబేద్కర్ స్థాపించిన మిళింద్ విద్యాలయం భవన నిర్మాణంలో మేస్త్రీగా, చిన్న కాంట్రాక్టర్‌గా శేషయ్య పనిచేశారు. అలా శేషయ్య అంబేద్కర్‌ని చూసి, మాట్లాడి ఎంతో ప్రభావితుడైనాడు. తన పిల్లల్ని అంబేద్కర్ లాగా చదివించాలనుకున్నాడు. అయితే 1965లో శేషయ్య మరణంతో కుటుంబ ఆర్థిక స్థితి దిగజారింది. ఇలా గద్దర్ అంబేద్కరిజంలో రెండవతరం.

గద్దర్ తూప్రాన్‌లో 1966-67లో హెచ్‌ఎస్‌సి దాకా చదివారు. కొంత కాలం ప్రభుత్వ హాస్టల్లో ఉండి చదువుకున్నాడు. హాస్టల్లో ఉంటూ కూలికెళ్లేవాడు. సున్నం వేయడం వంటి పనులు చేసి ఖర్చులకు సంపాదించుకునేవాడు. హాస్టల్లో ఉండడం వల్ల అంబేద్కర్ సంఘాలవారు పరిచయం అయ్యారు. వాళ్లు కులం గురించి, మతం గురించి, అంబేద్కర్ గురించి చెప్పేవాళ్లు. అలా విద్యార్థి దశలో అంబేద్కరిజం అంటే ఏమిటో తెలిసింది. తాను కూడా అలాంటి జీవితం నుండి అనుభవాల నుండి రావడం వల్ల అంబేద్కరిజం ఎంతగానో ఆకర్షించింది.

హైదరాబాద్‌లోని సైఫాబాద్ సైన్సు కాలేజీలో 1968లో పియుసి చేశారు. అప్పుడే జై తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో 1969-70 ఇంజనీరింగ్‌లో చేరారు. 1976 అక్టోబర్ 25లో హైదరాబాద్‌లోని కెనరాబ్యాంక్ ఈస్ట్ మారేడ్‌పల్లి బ్రాంచ్‌లో క్లర్క్ ఉద్యోగం రావడంతో పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన కార్యరూపందాల్చింది. గద్దర్ పెళ్లి హైదరాబాద్, కాచీగూడలో వుండే విమలక్కతో 9-11-1976న జరిగింది. పెళ్లయ్యాక విమలక్క కుటుంబానికి పెద్ద దిక్కైంది.

కెనెరా బ్యాంక్‌లో చేరినప్పటికీ 1980లో సాంస్కృతిక ఉద్యమంలో పూర్తికాలం పనిచేయటానికి ఉద్యోగాన్ని వదిలేశారు. పేరుకే ఉద్యోగంలో ఉన్నప్పటికి పూర్తికాలం కార్యకర్తగానే పనిచేశారని చెప్పవచ్చు. గట్టిగా ఒక్క ఏడాది పాటు ఉద్యోగం చేసాడో లేదో! ఎమర్జెన్సీలో డిఎస్పీ ఆల్‌ఫ్రెడ్ గద్దర్‌ని మొదటిసారి అరెస్టు చేశారు. 42 రోజుల జైల్ జీవితం తర్వాత బయటకొచ్చి తిరిగి ఉద్యోగంలో కొనసాగారు.

విమలక్క సనత్‌నగర్‌లోని కరెంట్ మీటర్ ఫ్యాక్టరీలో పనిచేసేది. వెంకటాపురం నుండి సనత్‌నగర్ చాలా దూరం. ఉదయం ఏడింటికి ఇంట్లో నుంచి బయలుదేరితే తిరిగి ఇంటికి చేరే సరికి రాత్రి అయ్యేది. గద్దర్ పై ఎన్నో హత్యా ప్రయత్నాలు జరిగాయి. ఎక్కడికక్కడ నిర్బంధించారు. నిర్బంధంలోనూ పాటే ఆయుధంగా ముందుకు సాగారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 6-4-1997న కొందరు ఆగంతకులు తుపాకి పేల్చారు. ఆరు తూటాలు గద్దర్ శరీరాన్ని తూట్లు పొడిచాయి. అతి కష్టంమీద డాక్టర్లు బతికించారు. ఒక తూటా ఇప్పటికీ వెన్నుపూసలో ఉండిపోయింది.

గద్దర్, విమలక్క దంపతులకు ముగ్గురు పిల్లలు. సూర్యుడు, చంద్రుడు, వెన్నెల. వీరు తమకు తామే ఎదుగుతూ వచ్చారు. వారి ఆలనాపాలనా తల్లిదండ్రులుగా గద్దర్, విమలక్క చూసుకోవడం సాధ్యపడని పనివత్తిడి. వీరి పరిస్థితి గమనించి బి.నర్సింగరావు తమ్ముడు హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫోర్డ్ గ్రామర్ స్కూల్ ఛైర్మన్ వేదకుమార్, తమ స్కూల్లో, హాస్టల్లో ఉచితంగా చేర్చుకొని తనవంతు సహకారం అందించారు.

చంద్రుడు 31-12-2003లో చనిపోయారు. చనిపోయే నాటికి చంద్రం ఎమ్.బి.బి.యస్ మూడో సంవత్సరం. గద్దర్ బెంగుళూరులో సభలు, సమావేశాలలో పాల్గని ఇంటికి చేరే సరికి ఆరోగ్యం దెబ్బతిన్నది. ఆస్పత్రి పాలైయ్యారు.

ఆస్పత్రికి ఇంటికి తిరుగుతూ చంద్రం అకాల మరణం చెందారు. వారి జీవితాలు ఎన్నో ఒడిదుడుకులకు లోనైయ్యాయి. కొడుకు, కూతురు తలా ఒక పనిచేసుకొని బతుకుతున్నారు. తల్లిదండ్రులను సాదుకుంటున్నారు.

గద్దర్ తల్లి సావిత్రిబాయి ఫూలేలా గోచి చీరతో మహారాష్ట్ర సంస్కృతి ఉట్టిపడేలా ఉంటుంది. మా అమ్మ కూడా అలాగే ఉంటుందని గద్దర్ గుర్తుచేస్తుంటాడు. వృత్తులు వేరైనా మా శ్యామల కష్టాలు, విమలక్క కష్టాలు ఒక్కటే కదా అని గద్దర్ విప్లవకారుల కుటుంబాల కష్టాలను, కన్నీళ్లను సార్వజనీనంగా సాహిత్యీకరించారు. అలా తల్లి లచ్చుమమ్మను, విమలక్కను సార్వజనీనంచేస్తూ పాటలు రాశారు.

గద్దర్‌ను మలచిన తొలినాళ్ళ పరిణామాలు :

గద్దర్ ప్రభుత్వ హాస్టల్ విద్యార్థిగా వుంటూ 1965ల్లో అంబేద్కరిజం గురించి, కుటుంబ సంక్షేమం గురించి పాటలు పాడేవాడు. ప్రదర్శనలు యిచ్చేవాడు. చదువుకున్న దళితుల్లో సాధారణంగా మొదట అంబేద్కరిజమే ప్రాచుర్యంలో వుండేది. అలా తండ్రి ద్వారా అక్కయ్య ద్వారా, అంబేద్కర్ సంఘాల ద్వారా, మిత్రులద్వారా అంబేద్కరిజం నుండి ప్రారంభమైన ఒక దళితుడు గద్దర్. బి.నర్సింగ్‌రావు గద్దర్ కలుసుకోవడం జరిగి వుండకపోతే గద్దర్ అంబేద్కరిజం, దళిత ఉద్యమంలో కొనసాగి ఉండేవాడు.

జననాట్య మండలి :

పార్టీకి గానీ, విరసం గానీ లేని ఒక సౌకర్యం జననాట్య మండలికి వుంది. విరసం ప్రధానంగా మధ్య తరగతి మేధో, సాహిత్యరంగాలకు పరిమితమైంది. దాని ఉపన్యాస ప్రక్రియ ఒక్కటే అట్టడుగు ప్రజల దాకా చేరగలిగింది. పార్టీ రహస్య నిర్మాణానికి పరిమితమైంది. జెఎన్నెం ఈ రెండు పరిమితుల్ని అధిగమించింది. ఆ క్రమంలో ప్రజల జీవితాల లోతుల్లోకి వెళ్ళడం, హృదయాలను పసిగట్టడం, వాటినించే తమ రాజకీయ, మానవీయ సంబంధాల సారాన్ని చెప్పడం మొదలయ్యాయి. 1970 నుండి 1976 మధ్య విద్యార్థి, యువజనులను ఉద్యమాల్లోకి ఆహ్వానిస్తూ అనేక ప్రదర్శనలు ఇచ్చారు గద్దర్. ఎమర్జెన్సీలో మెదక్ జిల్లా గిరాయి పల్లెలో ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేసిన రాడికల్ విద్యార్థుల గురించి ఒగ్గు కథ రాసి ప్రదర్శించారు. కొండపల్లి సీతారామయ్య, కె.జి.సత్యమూర్తి తదితరుల నాయకత్వంలో సాగిన విప్లవోద్యమ లక్ష్యాలను ముందుకు తీసుకొనిపోతూ ప్రజల సమస్యలను పట్టించుకొని వాటి పరిష్కారం కోసం ఉద్యమాల్లోకి రావలసిందిగా ఆహ్వానిస్తూ తన కార్యక్రమాలను జననాట్యమండలి ద్వారా ముందుకు తీసుకుని వెళ్ళారు.

రాడికల్ విద్యార్థి యువజన -రైతుకూలీ సంఘాలు :

ప్రజాసంఘాల నిర్మాణం యొక్క ఆవశ్యకతని కాలక్రమంలో విప్లవ పార్టీలు గుర్తించాయి. 25-6-1975న అర్ధరాత్రి ఎమర్జెన్సీ విధించబడింది. అనేకమంది చంపబడ్డారు. ఎందరో జైళ్ళపాలయ్యారు.

1977మార్చిలో జనతాప్రభుత్వం కేంద్రంలో ఏర్పడింది. అపుడు నిర్బంధాలు తొలగిపోయాయి. అప్పుడు కొంత స్వేచ్ఛగా ఎంతవీలైతే అంతగా ప్రజాసంఘాల నిర్మాణం సాగింది. అలా విద్యార్థి సంఘాల తోపాటు రాడికల్ యువజన సంఘం ఏర్పడింది. అటుతర్వాత రైతుకూలీ సంఘం ఏర్పడింది. అలా పార్టీ నిర్మాణం కొంత పటిష్టమైంది.

“ఉదయం” అనే ఆర్ట్ లవర్స్ సంచిక 1973లో గద్దర్‌పై ఆర్టిస్ట్ చంద్ర వ్యాసం వ్రాశారు. సుప్రభాతం వార పత్రికలో 1997-99లో కాసుల ప్రతాపరెడ్డి, గద్దర్ ప్రస్థానం గురించి, జీవితం గురించి, ఆనాటి ఫోటోలతో సహా కవర్‌పేజీ వ్యాసం వ్రాశారు. చూపు మాస పత్రికలో 2000 ఏప్రిల్ సంచికలో “నేను-నాపాట” అనే గద్దర్ వ్యాసం ప్రచురించారు. “ప్రజాసంగీతం పట్టించుకోవల్సిన సంగతులు”, అనే గద్దర్ రాసిన వ్యాసం, “గద్దర్ సంసారం చేసేది పాటలతోనే” అని చెప్పిన విమలక్క ఇంటర్వ్యూ ఆంధ్రజ్యోతి ఆదివారం 1997 ఏప్రిల్ సంచికలో ప్రచురించారు. తుపాకి తూటాను జయించిన పాట అని ఎం. లక్ష్మయ్య రాస్తే, ప్రపంచంలో పాల్‌రాబ్సన్ తరువాత గద్దరే మనకు కన్పిస్తారు అని దేవిప్రియ తదితరులు పేర్కొన్నారు. వర్గిస్ “నీ చెమట ఇనుకని చేనుందా! నువు చెయ్యని చీజుందా?!! అని గద్దర్ పాటను పేర్కొంటూ గద్దర్ పాటల పుస్తకానికి 1981 ఏప్రిల్‌లో ముందుమాట రాస్తూ అనేక కోణాల్లో గద్దర్‌ని పరిచయం చేశారు. “పాటలు - ఆటపోట్లు” అనే చిన్న పుస్తకాన్ని గద్దర్ 1995 లో స్వయంగా ప్రచురించారు. పొత్తూరి వెంకటేశ్వరరావు గద్దర్‌ని యుగకర్త అని పేర్కొన్నారు. 1980లలో సుధ, కిరణ్, వీరన్న, రాజన్న, సత్తన్న, నారాయణ, వంగపండు, కె.సి., భూపాల్ వంటి ఎందరో పాటలు రాశారు. మాభూమి సంధ్య కంఠం జననాట్యమండలికి ఒక ప్రత్యేకతను సంతరించిపెట్టింది.



- బిఎస్ రాములు
బీసీ కమిషన్
మాజీ చైర్మన్
8331966987

## ఓడిన అధికారుల అహంకారం - గెలిచిన దళిత మహిళ

### - ఫలించని రాజకీయ కుట్రలు - మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హై కోర్టు

### చిన్నాపూర్ సర్పంచ్ గా తిరిగి బాధ్యతలు చేపట్టిన దమ్మ లత శ్రీ నర్సింగం



బుగ్గారం ఆగస్టు 14 (ప్రజా మంటలు) : జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ రాజకీయాల్లో అధికారుల అహం ఓడిపోగా.... ఓ దళిత మహిళ న్యాయపోరాటంలో తిరిగి గెలిచి,తన స్థానాన్ని తాను తిరిగి నెల రోజుల్లోనే సాధించుకుంది. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన దళిత మహిళ దమ్మ లత శ్రీ నర్సింగం సర్పంచ్ గా తన స్థానాన్ని తాను సోమవారం తిరిగి పొందింది. అధికారిక ఉత్తర్వుల ప్రతిని మండల పంచాయితీ అధికారి అఫ్జల్ చేతుల మీదుగా సోమవారం చిన్నపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆమెకు అందజేశారు. పనులు చేయాలని అధికారుల వేధింపులు, ప్రభుత్వం ద్వారా 12నెలల నుండి నిధులు రాకపోవడం, చేసిన పనులకు బిల్లులు రాక ఏడు లక్షల రూపాయలు బాకీ అయ్యాం, ఇలాంటీ బాధలు ఇక మేము భరించ లేము అనే కారణాలతో చిన్నాపూర్ సర్పంచ్ దమ్మ లత శ్రీ నరసింగం జూలై 11న రాజీనామా చేశారు. ఎలాంటి వివరణ తీసుకోకుండా అట్టి రాజీనామాను వెంటనే జిల్లా ఉన్నతాధికారులు ఆమోదించారు. వెను వెంటనే ఉప సర్పంచ్ బర్ర మమత నాగరాజు లకు ఇంచార్జీ సర్పంచిగా బాధ్యతలు కూడా అప్పగించారు. కొందరు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో హుటాహుటీన నా రాజీనామాను ఆమోదించారు. మాకు రావాల్సిన బిల్లులు చెల్లించడం లేదు, చట్టబద్ధంగా ఈ ఆమోదం ప్రక్రియ కొనసాగలేదు, చట్టానికి విరుద్ధంగా నా రాజీనామాను ఆమోదించారు తప్పా... నానుండి ఎలాంటి వాంగ్మూలం సేకరించలేదు, సవివరణ తీసుకొని జిల్లా కలెక్టర్ ఆమోదించాల్సి న సర్పంచ్ రాజీనామాను ఒక జిల్లా పంచాయతీ అధికారి చట్ట విరుద్ధంగా ఎలా ఆమోదిస్తారు అని దమ్మ లత శ్రీ నర్సింగం తెలంగాణ హై కోర్టును ఆశ్రయించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆమోదించిన సర్పంచ్ రాజీనామా చెల్లదని హై కోర్ట్ గత జూలై 31న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కోర్ట్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ సూచనలతో జిల్లా పంచాయితీ అధికారి దేవరాజు తిరిగిచిన్నపూర్ సర్పంచ్ బాధ్యతలను దమ్మ లత శ్రీ నర్సింగంలకు అప్పగిస్తున్నట్లు ఈనెల 11వ తేదీ తో ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం అట్టి ఉత్తర్వుల ప్రతిని మండల పంచాయితీ అధికారి అఫ్జల్ చిన్నపూర్ గ్రామంచాయతీ లో దమ్మ లతశ్రీ కి అందజేస్తూ సర్పంచ్ గా బాధ్యతలను కూడా తిరిగి ఆమెకే అప్పగించారు. కాగా ఈప్రక్రియ ను అడ్డుకోవడానికి రాజకీయ శక్తులు శత విధాలుగా ప్రయత్నించి విఫలం అయ్యాయి. జూలై 31న వెలువడిన హై కోర్ట్ ఉత్తర్వులను కూడా భేఖాతరు చేసే ప్రయత్నం చేసి ఓటమి పాలయ్యారు. పలు సందర్భాల్లో రసాభాసలు కూడా కొనసాగాయి. అధికార వర్గం అనేక రకాల ఆరోపణలు కూడా ఎదుర్కోవడం జరిగింది. అయినా ఒక దళిత మహిళ ప్రజాప్రతినిధిగా ఎదిగితే ఇన్ని కుట్రలా అంటూ ప్రజలు ముక్కున వేలేసుకున్నారు.

## సకల జనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం




### సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి ఆగస్ట్ 14 (ప్రజా మంటలు) : సకల జనుల సంక్షేమమే పరమావధిగా కేసిఆర్ నేతృత్వం లోని రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని, ఆ క్రమం లోనే నిరాదరణకు గురవుతున్న చేతి కులవృత్తుల వారికి బిసి బంధు పథకం పేరుతో ఆర్థిక సహాయం అందించడం జరుగుతుమ్నదని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో సోమవారం బీసీ బంధు పథకాన్ని మంత్రి కలెక్టర్ యస్మిన్ భాషా, జెడ్పి చైర్ పర్సన్ దావ వసంతల తో కలిసి ఆయన ప్రారంభించారు. మొదటి దశలో నియోజకవర్గస్థాయి లో ప్రభుత్వంచే మంజూరైన 400 మంది చేతివృత్తులకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మంత్రి ప్రసంగిస్తూ.. చేతి వృత్తుల వారిని గత ప్రభుత్వాలు విస్మరించాయని, ఆదరణ తగ్గిన నేపథ్యంలో అట్టి వర్గాల వారికి చేయూత నందించే గొప్ప పథకం బీసీ బంధు అని లక్ష రూపాయల ఆర్థిక సహాయం ద్వారా కులవృత్తులు మనుగడలో ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఈ పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, పథకం తెచ్చిన గొప్ప మనసున్న మారాజు ముఖ్యమంత్రి అని, ప్రభుత్వం ఏ స్కీం తెచ్చిన దానిలో మానవీయ కోణం దాగి ఉంటుందని మంత్రి ఈశ్వర్ కొనియాడారు. జెడ్పీ చైర్ పర్సన్ దైవ వసంత మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలులో అగ్రభాగం మంత్రి కొప్పుల ఈశ్వర్ నియోజక వర్గంలో అమలు అవుతుండడం మంత్రి కృషికి నిదర్శనం అన్నారు. జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా మాట్లాడుతూ, నియోజక వర్గానికి 300మందికి సాయం అందాల్సి ఉండగా, సంభందిత మంత్రితో మాట్లాడి మన మంత్రి కొప్పుల ఈశ్వర్ 100మందికి అదనంగా సాయం అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి సాయిబాబా, సహాయకులు వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, మార్కెట్ చైర్మన్ రాజేశ్, రైతు కమిటీ చైర్మన్ భీమయ్య, దేవస్తానం ఛైర్మన్ రామయ్య, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

## ఊరూరా కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలు



వర్ని : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమం ఉమ్మడి జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నది. ఊరూరా కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఉత్సాహంగా తరలివస్తున్నారు. శిబిరంలో వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలను అందజేస్తున్నారు. వర్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తనిఖీ చేశారు. శిబిరంలో ఇప్పటి వరకు ఎంత మందికి కంటి పరీక్షలు నిర్వహించారు, ఎన్ని కళ్లద్దాలు పంపిణీ చేశారు తదితర వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన వారికి 100 శాతం కంటి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు కలెక్టర్ వెంట తహసీల్దార్ విఠల్, ఎంపీవో చందర్ తదితరులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 14,799 మందికి నేత్ర పరీక్షలు చేసి, 1873 మందికి కళ్లద్దాలు అందజేశారు.

కామారెడ్డి జిల్లాలో మొత్తం 5,622 మందికి పరీక్షలు నిర్వహించి 681 మందికి కంటి అద్దాలను అందజేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 76,835 మందికి పరీక్షలు నిర్వహించి 13,964 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని తెలిపారు. 1,192 మందికి కంటి అద్దాలు అందజేసినట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 1,32,793 మందికి పరీక్షలు నిర్వహించి, 47,766 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు

## చిరుధాన్యాల సాగుపై అవగాహన

ముకరంపుర: వ్యవసాయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులకు చేయూతనందించేందుకు కరీంనగర్‌లోని చింతకుంటలో గల వ్యవసాయ పరిశోధనా స్థానం వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నది. అందులో భాగంగా ఆధునిక యంత్ర పరికరాలతో క్షేత్ర ప్రదర్శనతో పాటు చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించింది. కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ముఖ్య అతిథిగా హాజరై జడ్పీ సీఈవో ప్రియాంకతో కలిసి ఈ సదస్సును ప్రారంభించారు. వందలాది మంది రైతులు తరలిరాగా, అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. అలాగే సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల ప్రతినిధులు తమ ఆధునిక యంత్ర పరికరాలు, చేతితో నడిపించే పరికరాలు, పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్, బూమ్ స్ప్రేయర్లను ప్రదర్శించి, వాటి వినియోగం, ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీ వివరాలను వివరించారు. రైతులు యంత్ర పరికరాలు, చిరుధాన్యాల సాగుపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. డాక్టర్ పీ రాజయ్య వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, డాక్టర్ మధూకర్‌రావు చిరుధాన్యాల సాగు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వ్యవసాయంలో దుక్కి దశ నుంచి ధాన్యాన్ని



బస్తాల్లో నింపే వరకు యంత్రాలు, పరికరాలను వినియోగించే విధంగా పరిశోధనలు చేస్తున్నాం. ముఖ్యంగా చేతితో కలుపు తీసే యంత్రాల తోపాటు ఇతర పరికరాలను పరిశోధనా స్థానంలోనే రూపొందించి లాభాపేక్ష లేకుండా రైతులకు విక్రయిస్తున్నాం. కొత్త యం త్రాలను రూపొందిస్తున్నాం. ఇతర రాష్ట్రాల్లో అభివృద్ధి చేసిన యంత్రాలను సైతం మన సాగు విధానాలకు అనుగుణంగా రూపొంది స్తున్నాం. ముఖ్యంగా వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే దున్ని ఎరువుగా మార్చేలా పరికరాలను వినియోగించాలి.



జనగామ జిల్లా కేంద్రంలోని ఒకేషనల్ కళాశాలలో 18వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా విద్యార్థి యువగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని విద్యార్థి జేఏసీ జిల్లా నాయకులు లావుడియా అనిల్ చౌహన్ పాల్గొన్న శ్రీను, గణేష్, మధు, అన్వేష్, ఫిరోజ్, సంతోష్ కరపత్రాలను విదూయాల చేశారు.గద్దర్ సమాధి వద్ద నివాళులు అర్పించిన బాబ్జీ

## బీఎస్ఎన్ఎల్ కార్మిక నేత ముత్తయ్య మృతి

**సికింద్రాబాద్, ఆగస్ట్ 14 (ప్రజామంటలు) :**



బీఎస్ఎన్ఎల్ కవాడిగూడ మాజీ సబ్ ఇన్స్పెక్టర్ పి.ముత్తయ్య ఆకస్మికంగా మృతి చెందినట్లు పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. బీఎస్ఎన్ఎల్ లో తోటి ఉద్యోగ సిబ్బందికి ఎప్పుడు చేదోడువాదోడుగా ఉంటూ, గత 30 ఏండ్లుగా ఎదుటి వారి సమస్యలను పరిష్కరించడానికి ముందుండి నడిచిన ముత్తయ్య మరణం తీరని లోటు అని బీఎస్ఎన్ఎల్ మాజీ ఉద్యోగి, ముదిరాజ్ కమ్యూనిటీ ఆలిండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, ఆయన ఫ్యామిలీ మెంబర్స్ కు వెంకటేశ్వర్లతో పాటు మోహన్ దాస్, నారాయణ స్వామి, చంద్రమోహన్, జీపీ శ్రీనివాస్ లు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండ నడుపుతున్న వైష్ణవి పాఠశాలని మూసివేసి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్.ఎస్.యు.ఐ జనగామ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభి గౌడ్ కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు

## ఘర్ ఘర్ తిరంగ్ యాత్ర బైకు ర్యాలీ



**తరిగొప్పుల ఆగస్టు14 (ప్రజామంటలు) :**
మండలంల బిజెపి మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణంలో ఘర్ ఘర్ తిరంగ్ యాత్ర బైకు ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనగామ జిల్లా బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప హాజరైనారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరంగ్ యాత్ర బైక్ ర్యాలీ ముఖ్య ఉద్దేశం స్వతంత్ర పోరాటంలో ఎంతో మంది అమరులైన వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం కోసం ప్రధాని మోదీ ఆదేశానుసారం ఈ కార్యక్రమం చేపట్టామని అదేవిధంగా ప్రపంచ నలుమూలలో ఉన్నటువంటి దేశాలు ఈ రోజున భారత ప్రధాని నరేంద్ర మోడీ వైపు చూస్తున్నాయని మోదీ పాలన అవినీతి అంతం అనే నినాదంతో ముందుకు సాగుతుంది అని నాడు మహాత్మా గాంధీ చేపట్టిన క్విట్ ఇండియా కార్యక్రమం దేశ నలుమూలల ఏ విధంగానైతే తీసుకెళ్లారో ఈ రోజున మోదీ క్విట్ కరప్షన్ అవినీతిని మన దేశం నుండి పార దోలుదాం అని అన్నారు. కుటుంబ పాలనలో ఎంతో అవినీతి కుంభకోణాలు జరుగుతున్నాయని, వాటిని కూడా రాష్ట్రం నుండి మన దేశం నుండి తరిమికొడదాం అని అన్నారు పేదల కోసం రాష్ట్ర ప్రజల కోసం ప్రభుత్వం పని చేయాలి తప్ప తన కుటుంబ స్వలాభం కోసం పనిచేయకూడదని హెచ్చరించారు.దేశ అభివృద్ధి కోసం యువత ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ పాషా, యువ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ నవీన్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రామ్ నర్సింహారెడ్డి ,మండల ఉపాధ్యక్షుడు తలకొక్కుల శ్రీనివాస్, కొన్నె రాజు, శ్రీకాంత్ ,రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఋణ సహాయం



**ధర్మపురి ఆగస్ట్ 14 (ప్రజా మంటలు) :**
ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అద్వర్యంలో బావి మరియు పైప్ లైన్ త్రవ్వకం కోసం 15 లక్షల రూపాయల చెక్కులను డీసీఎంఎస్ చైర్మన్, అధ్యక్షులు ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి రైతులకి పంపిణీ చేసారు.వీరిలో ఓజ్జల అక్కపెల్లి, నరెడ్ల మమత లకు 6 లక్షలు, నాయిని సత్తెన్న 3లక్షల రూపాయల చెక్కులనుఅందజేశారు. ఈ సందర్భంగా అద్యక్షులు మాట్లాడుతూ రైతులు తక్కువ వడ్డీకి రుణ%శీ% పొంది తిరిగి సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. సంఘ డైరెక్టర్ లు పేరుమాండ్ల ఎల్లా గౌడ్ మరియు నాయకులు దాసరి లచ్చయ్య ,%జుఖిఎం ఎవశీ% అయ్యోరి రాజేష్, రైతులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం:జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



**జనగామ ఆగస్టు 14 (ప్రజామంటలు) :**
చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. జాతీయ చేనేత వారోత్సవాల సందర్భంగా జిల్లా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలు వెనుకబడిన తరగతుల చేతి వృత్తుల తదితర కుల ఆధారిత వారికి ఆర్థిక అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిద్దన్నారు, ఈ కార్యక్రమంలో భాగంగా నేతన్నకు చేయూత పథకం ద్వారా 1 కోటి,30 లక్షల, రూపాయల చెక్కులను పంపిణీ చేశారు, నేతన్నకు బీమా పథకం కింద ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. చేనేత మిత్ర పథకం కింద 40 శాతం నూలు పై సబ్సిడీ అందిస్తున్నట్లు చెప్పారు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేనేత కార్మికులకు అనేక పథకాలు అమలుపరుస్తూ వారి కుటుంబాల కు ఆర్థిక భరోసానిస్తున్నట్లు తెలిపారు, చేనేత వృత్తిలో నైపుణ్యం పొందిన కార్మికులకు మెమొంటో శాలువాతో ఘనంగా సన్మానించారు, చేనేత రంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు శాల్ మెమొంటోతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు చేనేత జౌళి శాఖ అధికారిని పి.చౌడేశ్వరి, సంఘ అధ్యక్షులు వేముల బాలరాజు, గుర్రం నాగరాజు, భేతి విమల, కూరపాటి శ్రీనివాస్, వెంకటేష్, కోడం శ్రీనివాస్, డెవలప్మెంట్ ఆఫీసర్ రజిని, హేమలత, జిల్లా అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## పద్మ శాలీలు ఐక్యంగా ఉండి తమ ఆస్తిత్వాన్ని చాటాలి పద్మ శాలీలకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలి

### - వార్డ్ మెంబర్ నుండి పార్లమెంట్ వరకు దామాషా పద్దతిలో సీట్లు కేటాయించాలి





**కోరుట్ల టౌన్ ఆగస్టు 14 (ప్రజా మంటలు) :**
చట్ట సభల్లో పద్మశాలీల ప్రాతినిధ్యం ఉండేలా మన ఆస్తిత్వాన్ని చాటాల్సిన అవసరం మన అందరిపైన ఉందని మధ్య ప్రదేశ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ పరికి పండ్ల నరహరి, అర్గనైసింగ్ కమీటీ చైర్మన్ బసవ లక్ష్మి నర్సయ్య అన్నారు. కోరుట్లలో ఆదివారం రోజున జరిగిన పద్మ శాలి యుద్ధ భేరి సభకు వివిధ ప్రాంతాల నుండి సుమారు 60వేలకు పైగా కుల భాందవులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ చట్ట సభల్లో పద్మ శాలీలు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని, బీసీలలో అతి పెద్ద కులంగా పద్మ శాలీలు ఉన్నారని మనమందరం ఐక్యంగా ఉంటేనే చట్ట సభల్లో గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. తర్వాత ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ చేనేత రంగం రెక్కడితే డొక్కాడని స్థితిలో ఉందని, నరాలనే పోగులుగా చేసి రక్తాన్ని రంగుగా మార్చి, గుండె ను కండెగా చేసి చేనేత కార్మికులు బ్రతుకుతున్నారని అన్నారు. వరంగల్ మేయర్ గుండు సుధారాని, రాష్ట్ర అధ్యక్షులు రామ శ్రీనివాస్ మరియు కర్నూల్ ఎంపీ డా :సంజయ్ కుమార్లు మాట్లాడుతూ పద్మ శాలీలు రాజకీయంగా ఎదగాలని, చట్ట సభల్లో మన ప్రాతినిధ్యం ఉండాలంటే ప్రతి పద్మశాలి ఏకమై మనకులస్తులకే ఓటు వేసి మన ఐక్యత చాటాలని అలాగే మన బలగం, బలం చూపించాల్సిన అవసరం ఉందని 24అసెంబ్లీ కేంద్రాల్లో మన బలం ఉంది కావున రాజకీయ పార్టీలు దీన్ని గమనించి టికెట్ ఇవ్వాలని అన్నారు. ఈ ఎన్నికల్లో 119స్థానాల్లో రిజర్వేషన్ పోగా మిగిలిన స్థానాల్లో పద్మ శాలీలకు అవకాశం కల్పించాలని ఈ అవకాశాలు కల్పించిన రాజకీయ పార్టీలకే పద్మ శాలీల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. పద్మశాలీలు అందరూ ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించుకోగలుగుతామని నేతలు అన్నారు.పెద్ద సంఖ్య లో వాహనాల్లో తరలి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసు శాఖ వారు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో జగిత్యాల జిల్లా అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు జక్కుల ప్రసాద్, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్పర్సన్, బిజేపి నాయకురాలు భోగ శ్రావని, గడ్డం మధు పద్మ శాలి నాయకులు మరియు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన పద్మశాలీ నాయకులు పాల్గొన్నారు.

## 'ఇంద్రియ నిగ్రహం' తోనే నిజమైన స్వాతంత్ర్యం



**జనగామ ఆగస్టు 14 (ప్రజామంటలు):**
ఇంద్రియ నిగ్రహం తోనే నిజమైన స్వాతంత్రం లభిస్తుందని బ్రహ్మకుమారీస్ అంతర్జాతీయ ముఖ్య కేంద్రం మౌంట్ అబూ రాజస్థాన్ నుండి విచ్చేసిన పీస్ ఆఫ్ మైండ్ టీవీ ప్రోగ్రాం డైరెక్టర్ రాజయోగి బి కే వేణుగోపాల్ అన్నారు. బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం లభించి 77 సంవత్సరాలు కావస్తున్న భారతదేశంలో ప్రజలంతా సంపూర్ణమైన సుఖశాంతులతో జీవించలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ దీనికి కారణం ఇంద్రియని గ్రహం లేకపోవడమే అని పేర్కొన్నారు. జనగామ లో రాజ యోగిని బి కే విజయలక్ష్మి అధ్యక్షతన బ్రహ్మకుమారిలచే సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల లో ఆయన బి కే ప్రతినిధులతో కలసి జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ప్రసంగించారు. ఆయనతోపాటు రాజయోగ టీచర్లు బికే విజయలక్ష్మి, బి కే లావణ్య తదితరులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యావంతులు కూడా అనాగరికంగా ప్రవర్తిస్తూ సమాజంలో సుఖశాంతులకు భంగం కలగజేస్తున్నారని దీనికి ప్రధాన కారణం జ్ఞానేంద్రియాలు కర్మేంద్రియాలపై నిగ్రహం లేకపోవడమే అంటూ వారు తెలిపారు. ఈ సందర్భంగా రాజయోగ కోఆర్డినేటర్ బికే కిరణ్ భాయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యాప్తంగా ఉన్న బ్రహ్మకుమారి మెడిటేషన్ సెంటర్ల లో మూడు రోజులపాటు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు, ప్రముఖ కవి పెట్లోజు సోమేశ్వర చారి, రాజయోగ స్టూడెంట్ బి కే రజిని కిరణ్ ఆలపించిన జాతీయ గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

## మున్సిపల్ చిట్టా.. వివాదాల పుట్ట



నిర్మల్: 2021 డిసెంబరులో మున్సిపల్‌లో పీహెచ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది. చాలామందికి కాల్‌లెటర్లు పంపించారు. నామమాత్రంగా ముఖాముఖి, ధ్రువపత్రాల పరిశీలన చేపట్టిన అధికారులు తాము ముందుగానే ఎంపికచేసిన 44 మందికి ఉద్యోగాలు కట్టబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందులో బల్దియాకు చెందిన కీలకనేత కుటుంబసభ్యులు సహా అధికార పార్టీ నేతల బంధువులకు ప్రాధాన్యం కల్పించడం గమనార్హం. పలు పార్టీలు, ఇతర ఉద్యోగార్థుల ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. విషయం తీవ్రమవడంతో విచారణ జరిపిస్తానని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా పాలనాధికారి ముషారఫ్ అలీ ఫారుఖీ హామీ ఇచ్చారు. వరుస ఆందోళనలు, వివాదాల నడుమ ఉద్యోగ నియామక ప్రక్రియను గత సంవత్సరం జులై 15నే రద్దు చేసినట్లు పాలనాధికారి ప్రకటించి, మున్సిపల్ కార్యాలయంలో నవంబరులో ఉత్తర్వులను ప్రదర్శించారు. పాత తేదీతో నోటీసులు ఏర్పాటుచేయడంపై స్థానికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. గత నవంబరులో ఆదిలాబాద్‌లో జరిగిన డిపార్ట్‌మెంటల్ పరీక్షకు నిర్మల్ మున్సిపల్‌లో పనిచేస్తున్న 14 మంది హాజరైనట్లు తెలుస్తోంది. వీటి ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ఇందులో 13 మంది ఫెయిలవ్వగా, ఒకరు పాసైనట్లుగా సమాచారం. ఆయాశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రమే డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది. నిర్మల్ బల్దియా పరిధిలో పరీక్షకు హాజరైనవారిలో పొరుగుసేవల సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా గతంలో జరిగిన పీహెచ్ ఉద్యోగాల భర్తీలో స్థానం దక్కించుకున్నవారని, ఆ ఉద్యోగ నియామక ప్రక్రియనే రద్దుచేశాక వీరు పరీక్షకు ఎలా హాజరయ్యారనేది సందేహాస్పదం. ఉద్యోగుల ఐడీ లేకుండా పరీక్ష రాసే అవకాశం లేదు. అయినా.. వీరు పరీక్ష రాయగలిగారంటే ఉద్యోగులకు ఐడీలు ఇచ్చారా, ఇస్తే ఎలా ఇచ్చారు? నియామక ప్రక్రియను రద్దుచేసిన అధికారులు ఇప్పుడు పరీక్ష పాసైన వారిని ఏం చేస్తారు లాంటి ప్రశ్నలు స్థానికులను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఎవరూ ఆదుర్దా చెందవద్దంటూ బల్దియా నాయకులు, అధికారులు అందరినీ మభ్యపెట్టేందుకు ప్రయత్నించారు. ఖజానాశాఖ నుంచి అప్పటికే ఐడీలు కేటాయించిన విషయమూ నిర్ధరణ చేయలేదు. కానీ.. ఇప్పుడు నియామక ప్రక్రియ రద్దు కన్నా ముందే ఐడీలు కేటాయించామని పేర్కొంటుండటం గమనార్హం. నియామక ప్రక్రియ రద్దు చేస్తున్నట్లు పాలనాధికారి ప్రకటించిన నోటిఫికేషన్ కన్నా ముందే ఐడీలు కేటాయించడంతో వారంతా డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌కు దరఖాస్తు చేసి పరీక్షకు హాజరయ్యారు.

## కిష్టరావుపేటలో పోలీసుల కార్డెన్ సెర్చ్



**మహాదేవపూర్ ఆగస్ట్ 14 (ప్రజా మంటలు)**
మహాదేవపూర్ మండలంలోని కిష్టరావుపేట గ్రామంలో ఎస్సై రాజ్ కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు చేసి అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు గ్రామంలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు నిషేధిత మత్తు పదార్థాలైన గుట్కా గుడుంబా గంజాయి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు యువత బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు

## ఎర్రమట్టి అక్రమంగా తరలింపు



చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో కొందరు ఎర్రమట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. మట్టి తరలింపు ప్రాంతా నికివెళ్లగా మట్టి తవ్వుతున్న పొక్లెయిన్ వేగంగా అక్కడి నుంచి వెళ్లిపోయింది. రోజూ ఆరేడు ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌లో 10 నుంచి 15 ట్రిప్పుల వరకు మట్టిని తరలిస్తున్నారు. ఇలా 70 నుంచి 100 ట్రాక్టర్ల మట్టి తరలిపోతోంది. డిమాండ్‌ను బట్టి ట్రాక్టరు మట్టి రూ.700 నుంచి రూ. 1000 వరకు విక్రయిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. విషయాన్ని తహసీల్దార్ సుబ్బలక్ష్మీ దృష్టికి తీసుకెళ్లగా అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## తాగునీటికి రోడ్డెక్కిన ప్రజలు



రాయదుర్గం: పట్టణంలోని వాల్మీకినగర్ ప్రజలు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ రాయదుర్గం– బళ్ళారి రోడ్డుపై బైఠాయించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో రాయదుర్గం ఎస్ఐ సుమన్ ఆందోళనకారులకు నచ్చచెప్పి మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ వాల్మీకినగర్ కొండకింద ప్రాంతంలో 300 మంది వరకు నివాసం ఉంటున్నామని, అక్కడ మినీట్యాంకులు కట్టినా పైపులైన్ కనెక్షన్ ఇవ్వలేదన్నారు. మున్సిపల్ అధికారులు రోజుకు రెండు ట్యాంకర్లు పంపుతున్నా ఏమాత్రం సరిపోవడం లేదు. వ్యవసాయతోటలు, ఉప్పునీటి బోర్ల నుంచి తెచ్చుకుంటున్నామని దుర్గయ్య, గోపి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ దివాకర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో శాంతించారు.

## విదేశీ విద్యకు పేద విద్యార్థులను దూరం చేసే కుట్ర

### - తెదేపా శ్రేణుల ఆందోళన



పుట్టపర్తి,:ఆంక్షలు పెట్టి విదేశీ విద్యను పేద విద్యార్థులకు దక్కకుండా వైకాపా ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెదేపా శ్రేణులు ఆందోళనకు దిగాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తెదేపా అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ పేరుతో ఉన్న విదేశీ విద్య పథకాన్ని ముఖ్యమంత్రి తన పేరు మీద మార్చుకొని అవమానించడమే కాకుండా పేద విద్యార్థులకు మోసం చేశారని ధ్వజమెత్తారు. ఈనెలలో విదేశీ విద్య పథకాన్ని అనంతపురం జిల్లాలో ఇద్దరు, పుట్టపర్తిలో ముగ్గురికే వర్తింపుజేశారని వాపోయారు. ఎస్సీలకు అన్యాయం చేశారంటూ కదిరిలో ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతపురం, కదిరి, కుందుర్పి, చిలమత్తూరు, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి, తదితర ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తెదేపా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల కడుపు కొట్టిన ముఖ్యమంత్రికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెదేపా హయాంలో 4923 మందికి రూ.364.98 కోట్లు ఇస్తే వైకాపా అధికారంలోకి వచ్చాక 213మందికి కేవలం రూ.19కోట్లు ఇచ్చారన్నారు.

# మనం పూర్తి ఆరోగ్యంగా ఉండాలంటే.. బీ విటమిన్లు తీసుకోవాల్సిందేనా..?




సమతుల ఆహారం తీసుకోవాలని మన పెద్ద వాళ్లు చెప్తుంటారు. అంటే మన శరీరానికి కావాల్సిన మినరల్స్, విటమిన్స్ లభించే ఆహారాలు. కొంచెం నీరసంగా అనిపించగానే ట్యాబ్లెట్లు వేసుకుంటాం. కానీ, ఆ నీరసం ఎందుకు వచ్చిందని ప్రశ్నించుకోం. మనం పూర్తి ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల ఆహారాలు తినేలా ప్లాన్ చేసుకోవాలి. వీటిలో ముఖ్యంగా విటమిన్ బీ ఫుడ్స్ ఉండటం చాలా అవసరం. బీ విటమిన్ ఆహారాలు నిత్యం తీసుకుంటే ఆరోగ్య సమస్యలు రాకుండా చాలా వరకు మనల్ని మనం కాపాడుకోవచ్చు. బీ విటమిన్స్ 8 రకాలు .. బీ1, బీ2, బీ3, బీ5, బీ6, బీ7, బీ9, బీ12. ఇవి నీటిలో కరిగుతాయి. మన శరీరం వివిధ విధుల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ విటమిన్లు శక్తి ఉత్పత్తి, మెదడు పనితీరు, డీఎన్ఏ సింథసిస్, కణ జీవక్రియతో సహా అనేక రకాల ప్రక్రియల్లో పాల్గొంటాయి. శరీరానికి ఆహారాన్ని శక్తిగా మార్చడంలో, రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇవ్వడం, మానసిక స్థితి, జీవక్రియను నియంత్రించడంలో బీ విటమిన్లు సహాయపడతాయి. వాటి ప్రాధాన్యతను వివరంగా తెలుసుకుందాం. శక్తి ఉత్పత్తికి, గుండె, కండరాలు, నాడీ వ్యవస్థ సరైన పనితీరుకు బీ1 (థయామిన్) అవసరం. ఇది కార్బోహైడ్రేట్ల జీవక్రియలో కూడా పాల్గొంటుంది. ఇది మన ఆహారంలోని చక్కెరలను విడగొడ్తుంది. మెదడుకు కావాల్సిన రసాయనాలను అందిస్తుంది. ఫ్యాటీ ఆసిడ్స్‌ను ప్రొడ్యూస్ చేస్తుంది. హార్మోన్స్‌ని సింథసైజ్ చేస్తుంది. బీ 1 లోపం కారణంగా బరువు కోల్పోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, గుండె సంబంధ సమస్యలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లుగా అనిపించడం వంటి సమస్యలు కనిపిస్తాయి. హెూల్ గ్రెయిన్స్, రైస్, సోయా బీన్స్, బ్లాక్ బీన్స్, నట్స్, బఠానీలు, కమలాపండు వంటివి తినడం ద్వారా బీ1 విటమిన్ పొందవచ్చు. బీ 2 (రైబోఫ్లావిన్) శక్తి ఉత్పత్తి, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, ప్రోటీన్ల జీవక్రియలో పాత్ర పోషిస్తుంది. ఇది ఆరోగ్యకరమైన చర్మం, కళ్ళు, నాడీ వ్యవస్థను నిర్వహించడంలో కూడా సహాయపడుతుంది. తీసుకున్న ఆహారంలో నుంచి ఫ్యాట్స్‌ను విడగొట్టి.. విటమిన్ బీ 6 ని శరీరానికి తగినట్లు మారుస్తుంది. బీ 2 లోపం కారణంగా నోటి పుండ్లు, పెదవుల వాపు, పగుళ్లు, జుట్టు ఊడటం, కళ్లు ఎర్రబడటం, స్కిన్ డిజార్డర్స్ కనిపిస్తాయి. ఈ విటమిన్ లోపం ఎక్కువగా ఉంటే ఎనీమియాకు దారితీయవచ్చు. ఓట్స్, పెరుగు, మజ్జిగ, పుట్టగొడుగులు, బాదం పప్పు, ఆకుకూరలు, పాలు, అవకాడోలలో బీ 2 విటమిన్ లభిస్తుంది. బీ 3 (నియాసిన్) శక్తి ఉత్పత్తి, డీఎన్ఏ సింథసిస్, నాడీ వ్యవస్థ పనితీరులో పాల్గొంటుంది. ఇది ఆరోగ్యకరమైన చర్మం, నరాలు, జీర్ణవ్యవస్థను నిర్వహించడంలో సాయపడుతుంది. ఈ విటమిన్ మనం తీసుకునే ఆహారంలో ఉన్న కార్బోహైడ్రేట్స్, ఫ్యాట్స్, ప్రోటీన్స్‌ని శరీరానికి కావల్సిన పద్ధతిలోకి మారుస్తుంది. మెటబాలిజంకు సహకరిస్తుంది. బీ 3 విటమిన్ లోపం కారణంగా ఎర్రగా మారిన నాలుక, వాంతులు, డయేరియా, కాన్స్టిపేషన్, తలనొప్పి, నీరసం, డిప్రెషన్ వంటి ఆరోగ్య సమస్యలు కనిపిస్తాయి. విటమిన్ బీ 3 ఎక్కువగా పప్పు ధాన్యాలు, హెూల్ గ్రెయిన్స్, నట్స్, గ్రీన్ పీస్, అవకాడో, మష్రూంస్, బ్రౌన్ రైస్, వేరు శనగల్లో దొరుకుతుంది. బీ 5 (పాంటోథెనిక్ యాసిడ్) శక్తి ఉత్పత్తి, హార్మోన్ సంశ్లేషణ, ఎర్ర రక్త కణాల ఉత్పత్తిలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఇది మన శరీరంలో ప్రొటీన్స్, ఫ్యాట్స్, కో-ఎంజైమ్స్‌లను క్రియేట్ చేస్తుంది. ఎర్ర రక్త కణాలు ఈ విటమిన్‌ను శరీరమంతా తీసుకెళ్తుంది. ఈ విటమిన్ లోపిస్తే కాళ్ళూ, చేతులూ మంటలూ, తిమ్మిరి, తలనొప్పి, చిరాకు, నిద్రలేమి, ఆకలి లేకపోవడం వంటి సమస్యలు వస్తాయి. ఈ సమస్యల నివారణకు పొద్దుతిరుగుడు విత్తనాలు, అవకాడో, బంగాళా దుంపలు, బ్రోకలి, ఓట్స్, శనగలు, వేరు శనగలు ఎక్కువగా తింటూ ఉండాలి. బీ 6 (పిరిడాక్సిన్) ప్రోటీన్ జీవక్రియ, రెడ్ బ్లడ్ సెల్స్ ఉత్పత్తి, నాడీ, రోగనిరోధక వ్యవస్థల పనితీరులో పాల్గొంటుంది. ఇది సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్లు, న్యూరోట్రాన్స్‌మిటర్ల ఉత్పత్తిలో కూడా సాయపడుతుంది. మనం తినే ఆహారంలో నుంచి ఫ్యాట్స్, కార్బోహైడ్రేట్స్ విడగొడ్తుంది. మెదడు అభివృద్ధి చెందడానికి సహకరిస్తుంది. రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. బీ 6 విటమిన్ లోపం కారణంగా ఎనీమియా, పెదవులు పగలడం, నాలుక వాపు, ఇమ్యూన్ సిస్టం బలహీన పడడం, డిప్రెషన్ వంటి సమస్యలు వస్తాయి. ఈ విటమిన్ ఎక్కువగా శనగలు, బంగాళా దుంపలు, పాలకూర, సోయా బీన్స్, ఎర్ర కందిపప్పు, పెసరపప్పు, అల్లం, వెల్లుల్లి, బ్రౌన్ రైస్‌లలో దొరుకుతుంది. బీ 7 (బయోటిన్) శక్తి ఉత్పత్తి, కొవ్వు జీవక్రియతోపాటు కొవ్వు ఆమ్లాలు, గ్లూకోజ్ సింథసిస్‌లో ప్రధానపాత్ర పోషిస్తుంది. ఆరోగ్యకరమైన చర్మం, జుట్టు, గోర్లకు అందగా ఉంటుంది. డీఎన్ఏను రెగ్యులేట్ చేస్తుంది. మనం తీసుకునే ఆహారంలో నుంచి ప్రొటీన్, కార్బోహైడ్రేట్స్, ఫ్యాట్స్ విడగొడుతుంది. బీ 7 విటమిన్ లోపం కారణంగా జుట్టు పల్చబడడం, గోళ్ళు పెళుసుగా తయారవడం, నీరసం, డిప్రెషన్ వంటి సమస్యలు వస్తాయి. ఈ విటమిన్ ఎక్కువగా పొద్దుతిరుగుడు విత్తనాలు, అరటి పండు, అవకాడో, కాలీఫ్లవర్, పుట్టగొడుగులు, పాలు, వేరు శనగ పప్పుల్లో లభిస్తుంది. డీఎన్ఏ సింథసిస్‌తోపాటు కణ విభజన, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి బీ 9 (ఫోలిక్ యాసిడ్) అవసరం. ఇది గుండె జబ్బులకు ప్రమాదాన్ని తెచ్చిపెట్టే హెూమోసిస్టీన్ స్థాయిల నియంత్రణలో కూడా పాల్గొంటుంది. విటమిన్స్, ఎమైనో యాసిడ్స్ మెటబాలిజంకు తోడ్పడుతుంది. కణ విభజన సక్రమంగా జరిగేలా చూస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే తలనొప్పి, నీరసం, చిరాకు, నోటి పుండు రావడం చూడొచ్చు. చర్మం, జుట్టు, గోర్లలో మార్పులు వస్తాయి. ఈ విటమిన్ ఎక్కువగా మనకు ఆకుకూరలు, అవకాడో, బొప్పాయి, ఆరెంజ్ జ్యూస్, బీన్స్, నట్స్, సోయా బీన్స్, రాజ్మా, కాప్సికం, బీట్‌రూట్‌లలో దొరుకు తుంది. బీ 12 (కోబాలమిన్) ఎర్ర రక్త కణాల ఉత్పత్తి, డీఎన్ఏ సింథెసిస్, నాడీ వ్యవస్థ పనితీరులో పాల్గొంటుంది. ఇది ఆరోగ్యకరమైన రోగనిరోధక వ్యవస్థను నిర్వహించడంలో సాయపడుతుంది, హెూమోసిస్టీన్ జీవక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ ఎర్ర రక్త కణాలు ఉత్పత్తయ్యేలా చేస్తుంది. మెదడూ, నరాల వ్యవస్థ సరిగ్గా పనిచేసేలా చేస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే మలబద్దకం. ఆకలి లేకపోవడం, కాళ్ళూ, చేతులూ తిమ్మిర్లు, జ్ఞాపక శక్తి తగ్గిపోవడం, డిప్రెషన్, నీరసం వంటి సమస్యలు కలుగుతాయి. వీటి నివారణకు పాలు, మజ్జిగ, పెరుగు, పన్నీర్, ఛీజ్, బటర్, న్యూట్రిషనల్ యీస్ట్, ఫోర్టిఫైడ్ ఆల్మండ్ మిల్క్ తీసుకోవడం అలవాటు చేసుకోవాలి.

## దేశచరిత్రలో మహనీయులంతా బహుజనులే

### -సంత్ రవిదాస్ జయంతి వేడుకల్లో జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

**మంథని**: దేశ చరిత్రలో మహనీయులంతా బహుజన వర్గాలకు చెందిన వారేనని బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జీ,పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం మంథని పట్టణంలోని రాజగృహాలో మహనీయుడు సంత్ రవిదాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవిదాస్ చిత్రపటానికి పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ , గ్రంథాలయ ఛైర్మన్ రఘువీర్ సింగ్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు చెందిన వారే మన కోసం ఆనాటి నుంచే పోరాటం చేశారని, 400 ఏండ్ల క్రితం సర్ధార్ సర్వాయి పాపన్న, వంద ఏండ్ల క్రితం మహాత్మపూలేలాంటి ఎంతో మంది మహనీయులు గొప్పగా ఆలోచన చేసి అందరూ కలిసి ఉండాలని, అందరూ గౌరవించబడాలని ఆరాటంతో పోరాటం చేసినట్లు చెప్పారు. ఇందులో సంత్ రవిదాస్ ఆరువందల ఏండ్ల క్రితమే బహుజన బిడ్డగా మన వర్గాలు ఐక్యతతో కులాలకు అతీతంగా జీవించాలని సందేశం ఇచ్చారని చరిత్ర చెబుతోందన్నారు. ఆనాడు రవిదాస్ నుంచే సమానత్వం మొదలైందని అప్పటి నుంచి ఎంతో మంది మహనీయులు తమ జీవితాలు, ప్రాణాలు త్యాగం చేశారని గుర్తుచేశారు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రచించిన రాజ్యాంగంలో పొందుపర్చిన విషయాలను తెలియకుండా ఆనాటి పాలకులు చేశారని, మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఒక్క కులానికే పరిమితం చేసి చరిత్రను వక్రీకరించారన్నారు. ఎంతో మంది విజ్ఞానవంతులు ఉన్న సమాజంలో చరిత్రను, రాజ్యాంగాన్నిమనకు తెలియకుండా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయుల చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరంప్రతి ఒక్కరిపై ఉందని, చరిత్రను తెలుసుకుని తిరగరాయల్సి అవసరం నేటి తరంపై ఉందని, లేకపోతే మనల్ని కాపాడేవారు ఉండరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నరు. ఈనాడు తామకంటే గొప్పవాళ్లు ఎవరూ లేరంటూ సోషల్‌మీడియాలో చెప్పుకుంటున్న తరుణంలో ఇంకా అవమానాలకు గురవుతున్న సమాజాన్ని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ఎంతో మంది మహనీయుల పుణ్యస్థలాలు, జన్మస్థలాలు సందర్శించిన తాను కాశీలోని రవిదాస్ ఆలయాన్ని సందర్శిస్తానని, ఈ ప్రాంతంలోని బహుజనులకు ఆయన గొప్పతానాన్ని తెలియజేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# అంచనాలకు మించి వరి సాగు



కరీంనగర్ మంకమ్మతోట: ఈ యాసంగిలో సైతం జిల్లా రైతులు వరి సాగు వైపే అధికంగా మొగ్గ చూపారు. గతేడాది ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిం చింది. సందిగ్ధంలో కొందరు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లారు. ఈసారి అలాంటి ప్రకట న ఏమి చేయకపోవడంతో అంచనాలకు మించి వరి సాగు చేస్తున్నారు. గత యాసంగి సీజన్‌లో జిల్లాలో 2,46,893 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం నమోదైంది. ఈ యాసంగిలో 2,44,000 వరకు వరి విస్తీర్ణం ఉండవచ్చని జిల్లా వ్యవసాయ అధికారులు అంచనాలు తయారు చేశారు. కానీ అంతకు మించి 2,54,015 ఎకరాల్లో ఇప్పటికే వరి సాగు చేశారు. మరికొన్ని చోట్ల ఇప్పటికీ సాగుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మొత్తంగా అధికారుల అంచనాలకు మించి ఇప్పటికే 7 వేల ఎకరాల వరకు పెరగగా, మరో పక్షం రోజుల్లో వేసే నాట్లతో కలిపి గతేడాదితో పోల్చితే పది వేల ఎకరాలు అధికంగా సాగయ్యే అవకాశముందని జిల్లా వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది అధిక వర్షాలు పడడంతో జిల్లాలో భూగర్భ జలాలపై బెంగ లేదు. అంతేగాకుండా కాళేశ్వరం పంపులు తిరిగి పనిచేయడంతో కాలువల కింద పంటలు వేసుకునే వారందరిలో నీటి విడుదలపై భరోసా వచ్చింది. సాగుకు సరిపడా విద్యుత్తు సరఫరా విషయంలో కూడా పెద్దగా ఇబ్బందులుం డవనే హామీతో రైతుల్లో సాగుపై మరింత భరోసా కల్గింది. గత రబీ సీజన్‌లో వచ్చిన వరి ధాన్యాన్ని మొత్తంగా ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయడంతో రైతుల్లో కొనుగోళ్లపై ఉన్న అపోహలు తొలిగిపోయినట్లు అయింది. అంతేగాకుండా ప్రపంచ మార్కెట్‌లో వరికి డిమాండ్ ఉండడంతో రబీ ధాన్యాన్ని ప్రైవేట్‌గా మిల్లర్లు సైతం పోటీపడి కొనుగోలు చేశారు. ఈ పరిణామాలు రైతుల్లో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై నమ్మకాన్ని పెంచినట్లు అయింది. సంబంధిత వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ ప్రక్రియ ద్వారా పంటల సాగు వివరాలను పకడ్బందీగా నమోదు చేస్తున్నారు. రైతుల వారీగా నీటి వసతి, అందుబాటులో ఉన్న వనరులు, మార్కెటింగ్ సదుపాయం తదితర వివరాలనూ నమోదు చేస్తున్నారు.

# దళితుల భూముల్లో బోరుబావులు



తలమడుగు: ఎలాంటి నీటి వసతిలేని దళితుల భూములను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం బోరు బావుల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో దళితుల భూముల్లో బోర్లు వేసి సాగు నీరందించేందుకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, భూగర్భ జల శాఖ సమన్వయంతో బోర్లు వేసేందుకు ప్రతిపాదనలు చేశారు. ముఖ్యంగా గత ఎనిమిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేసిన దళితబస్తీ భూముల్లో సాగునీటి సౌకర్యం లేని వారికి బోర్లు వేసేందుకు ప్రాధాన్యం కల్పించారు. ఇప్పటికే జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో దళితబస్తీ భూములను అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా దళితబస్తీ కింద 4,700 ఎకరాల భూమిని ప్రభుత్వం దళితులకు పంపిణీ చేసింది. వారందరికీ ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో బోర్లు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దళితుల అసైన్డ్‌భూములు, గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పంపిణీ చేసిన భూములకు సైతం బోర్లు వేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 500 దరఖాస్తులు రాగా వాటిని ఉన్నతాధికారులకు నివేదించారు. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి బోర్లు వేయనున్నట్లు అధికారులు తెలిపారు. తాంసి, తలమడుగు, జైనథ్, బేల, భీంపూర్, ఇచ్చోడ, ఆదిలాబాద్, మావల, గుడిహత్నూర్, ఇచ్చోడ తదితర మండలాల్లోని దళితుల భూములను భూగర్భ జల అధికారులు సర్వే నిర్వహించారు. ఉన్నతాధికారుల సిఫారసు మేరకే దళితుల భూముల్లో బోర్లు వేసే స్థలాన్ని నిర్ధారించారు. వారం రోజుల్లో ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నుంచి అనుమతులు వస్తాయి. ఒక్కో బోరును సుమారు 120 మీటర్ల లోతు వరకు కేసింగ్ పైపు(బోరు బావి కూలిపోకుండా) బిగించనున్నారు.

ఇందులో బోరుబావులు, ట్యూబ్ బావులు ప్రతిపాదించారు. ఒక్కోరైతుకు దాదాపు రూ.లక్ష నుంచి 3.5 లక్షల వరకు వెచ్చించనున్నారు. ట్యూబ్ బావులకు 70నుంచి 80 మీటర్ల లోతు వరకు కేసింగ్ పైపును ఏర్పాటు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా నీటి వసతిలేని దళితుల భూములను గుర్తించాం. ఇందులో దళితబస్తీ, అసైన్డ్, వివిధ పథకాల ద్వారా పంపిణీ చేసిన భూములకు బోర్లు వేస్తాం. దళితబస్తీ కింద పంపిణీ చేసిన భూములకు మొదటి ప్రాధాన్యం కింద బోర్లు వేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారుల అనుమతుల మేరకు పంపించాం. మేనేజింగ్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే టెండర్ల ద్వారా బోర్లు వేస్తాం. విడతల వారీగా లబ్ధిదారులందరికీ పథకాన్ని వర్తింపజేస్తాం. ఏమైనా సందేహాలు ఉంటే సంప్రదించాలి.

# కాసుల కష్టం.. నిర్మాణాలకు నష్టం

## రెండుపడక గదుల ఇళ్ల పురోగతికి అవరోధం

కరీంనగర్: కొసరు పనులతో ఉన్న ఇళ్లను మాత్రం పూర్తిచేయిస్తాం. క్షేత్రస్థాయిలో రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం చాలా కష్టమవుతోంది. నిర్మాణదారులు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోతున్నారు. ఏం చేయలేకపోతున్నాం." పేదల సొంతింటి కల రెండు పడకగదుల ఇళ్ల రూపంలో తీరడమనేది జిల్లాలో కష్టసాధ్యమైన ప్రక్రియగా మారింది. కొంచెం అటూ ఇటూగా దశాబ్ద కాలం నుంచి ఆగుతూ.. సాగుతున్న వీటి నిర్మాణాల విషయంలో గుత్తేదారులు బెంబేలెత్తు తున్నారు. బాబోయ్.. ఈ నిర్మాణాలు మావల్ల కాదనేలా చేతులెత్తేస్తున్నారు. సకాలంలో బిల్లులు అందక.. అందే బిల్లులు నిర్మాణాలకు సరిపడక నష్టాల బాట పడుతున్నామని బోరుమంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో మంజూరైన వేలాది ఇళ్ల



నిర్మాణాల ప్రక్రియ ముందుకు కదలడం లేదు. పునాదిస్థాయి దాటని తీరుతో చాలాచోట్ల ఇవి అందని ద్రాక్షగానే మారిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 6,494 ఇళ్లు మంజూరైనా పాలనాపరమైన అనుమతులు అందుకున్న వాటి సంఖ్య 6,360. గ్రామాల్లో రూ.5.04 లక్షలు, పట్టణాల్లో రూ.5.30 లక్షల వ్యయంతో వీటిని నిర్మించేందుకు అప్పట్లో రూ.390.56కోట్లు అంచనా వేశారు.

# పచ్చి మిర్చి.. ఆదాయం జాస్తి



సిద్దిపేట:వరి పంటకు ప్రత్యామ్నాయంగా సన్నమిర్చి పంటను సాగు చేస్తూ చిన్నకోడూరు, నారాయణరావుపేట మండల రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. కూరగాయ పంటల వైపు అన్నదాతలు ఆసక్తి కనబరచాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో రైతు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరిచారు. రెండు మండలాలకు చెందిన పలువురు కర్షకులు సన్న మిర్చి సాగు చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. వరికి పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. తెగుళ్ల బారిన పడుతున్నాయి. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో గత కొద్ది సంవత్సరాలుగా మిర్చి వేస్తున్నారు. తక్కువ పెట్టుబడి, కొద్దిపాటి నీటితో అధిక విస్తీర్ణంలో పంట సాగు చేసుకునే అవకాశం ఉండటంతో గంగాపూర్, మాచాపూర్, విఠలాపూర్, చంద్లాపూర్, రామంచ, గుర్రాలగొంది, జక్కాపూర్, మల్యాలలో అధికంగా ఆసక్తి కనబరుస్తున్నారు. దీనికి తుంపర సేద్య పరికరాలు అవసరం కావడంతో ప్రభుత్వం రాయితీపై అందజేస్తోంది. ప్రస్తుతం రెండు మండలాల్లో 750 ఎకరాల్లో సన్న మిర్చి వేస్తున్నారు. సన్న మిర్చి విక్రయించేందుకు గంగాపూర్, మాచాపూర్ గ్రామాల్లో ప్రభుత్వం ప్రత్యేక మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేసింది. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్‌లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం గంగాపూర్ మార్కెట్‌కు 33 టన్నులు తీసుకొచ్చారు. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని సిద్దిపేట ఉద్యాన శాఖాధికారి భాస్కర్‌రెడ్డి చెప్పారు. కొన్ని మండలాల్లోనే మిరపకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇంకా పెరగాల్సి ఉంది. మార్కెట్ సౌకర్యం ఉండటంతో ధర పలుకుతోంది. దృష్టి పెడితే ఎకరాకు రూ.1.80 లక్షల ఆదాయం పొదవచ్చని ఆయన పేర్కొన్నారు. పది సంత్సరాలుగా మిర్చి పంట సాగు చేస్తున్నా. ఈ ఏడాది రెండు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన. ఎకరాకు రూ.45 వేల వరకు ఖర్చు వచ్చింది. ఇప్పటి వరకు రెండు సార్లు మిరపకాయలను తెంపిన. గంగాపూర్ మార్కెట్‌లో అమ్మితే రూ.1.20 లక్షలు వచ్చాయి. ఖర్చులు పోనూ రూ.60 వేల వరకు ఆదాయం వచ్చింది. మరో ఎకరంలో రావాల్సి ఉంది. వరితో పోల్చితే దీనితోనే ఎక్కువ ఆదాయం. గ్రామంలో తోటి రైతులు మిర్చి పంట సాగు చేయడం చూసి గత 5 సంవత్సరాలుగా వేస్తున్న. ప్రస్తుతం ఎకరా విస్తీర్ణంలో సాగైంది. రెండు దఫాలుగా కాయలు తెంపి అమ్మిన. రూ.50 వేలు చేతికందింది.

# డంపింగ్ యార్డుపై నిర్లక్ష్యం

హుజూరాబాద్:స్థలం కేటాయించినా.. నిధులున్నా నిర్లక్ష్యమే అలుముకుంది. పనులు ప్రారంభించి మూడేళ్లు దాటినా ముందుకు సాగక అందుబాటులోకి రావడం లేదు. దీంతో తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చాలని ప్రభుత్వం నిర్దేశించినా ఇక్కడమాత్రం అమలుకు నోచుకోవడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపం.. గుత్తేదారు నిర్లక్ష్యం వల్లే పనుల్లో ప్రగతి కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాగైతే స్వచ్ఛ లక్ష్యం ఎలా నెరవేరుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హుజూరాబాద్ పురపాలికలోని 30 వార్డుల్లో 49,305 జనాభా ఉండగా 9,351 నివాసగృహాలు ఉన్నాయి. రోజూ 20 వేల మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు కానీ.. డంపింగ్ యార్డు లేకపోవడంతో మొన్నటి వరకు పట్టణంలో సేకరించిన చెత్తను ఇప్పలనర్సింగాపూర్, సిర్సపల్లి ప్రధాన రహదారులకు ఇరువైపులా జనావాసాల మధ్య పడేశారు. విపరీతమైన దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికుల అభ్యంతరంతో గతంలో డంపింగ్ యార్డు కోసం కేటాయించిన కొత్తపల్లి శివారులోని ఖాళీ స్థలంలో పారబోస్తున్నారు. హుజూరాబాద్ పురపాలికలోని ఇప్పల నర్సింగాపూర్‌లో అయిదెకరాల స్థలాన్ని కేటాయించి రూ.2.18 కోట్ల అంచనా వ్యయంతో మూడేళ్ల క్రితం పనులను ప్రారంభించారు. పొడి చెత్త కోసం రూ.38 లక్షలతో నిర్మిస్తున్న డ్రై రిసోర్స్ సెంటర్(డీఆర్సీ) ఫిల్లర్ల స్థాయిలోనే ఉంది. బయోమైనింగ్ ద్వారా తడి చెత్తను శుద్ధి చేసి తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చేందుకు రూ.12 లక్షలతో చేపడుతున్న మూడు వర్మీకంపోస్టు షెడ్ల నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. వేబ్రిడ్జి, ఇతర పనులకు రూ.12 లక్షలు కేటాయించినా ఇంకా టెండర్లు పిలువలేదు. అంతర్గత రహదారులకు రూ.18 లక్షలు, రూ.7.50 లక్షలతో డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి నిర్మాణ పనులు చేయాల్సి ఉంది. రూ.15 లక్షలతో డ్రైనేజీ నిర్మించినా ఇంకా పూర్తిస్థాయిలో పనులు కాలేదు. మొత్తం నిధుల్లో ప్రహరీ నిర్మాణానికే రూ.50 లక్షలు ఖర్చు చేయడం గమనార్హం. మొత్తంగా మూడేళ్లు దాటినా 50 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. సకాలంలో బిల్లులు చెల్లించక పనులు పూర్తి చేయడం లేదని గుత్తేదారు చెబుతున్నారు. కాగా రెండు నెలల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఏఈ సాంబరాజు తెలిపారు.

## రూ.లక్షలు వెచ్చించినా.. నెరవేరని లక్ష్యం!

సంగారెడ్డి: పట్టణ ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.లక్షలు వెచ్చించింది. పరికరాలకు అదే తరహాలో ఖర్చు చేసి, నెలలు గడుస్తున్నా ప్రారంభోత్సవాలకు నోచుకోవడం లేదు. సంగారెడ్డి రిక్షా కాలనీ, అమీన్‌పూర్ శ్రీవాణి నగర్, సదాశివపేట పట్టణం పాత సీహెచ్‌సీ కేంద్రంలో, అందోలు గూడెం, నారాయణఖేడ్‌కు వీటిని మంజూరు చేశారు. ఆయా ప్రాంతాల్లో భవనాల ఆధునికీకరణకు రూ.13లక్షలు, రూ.2లక్షలు ఫర్నిచర్‌కు వెచ్చించారు. ఇందులో నారాయణఖేడ్‌లో మాత్రమే సేవలను ప్రారంభించారు. ప్రస్తుతం అందులో కంటి వెలుగు వైద్య శిబిరం కొనసాగు తోంది. మిగిలిన నాలుగు చోట్ల ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఆయా ఆసుపత్రులను ప్రారంభించాలని సూచించినా, అడుగు ముందుకు పడలేదు. ఇప్పటికైనా ప్రారంభించాలని కోరుతున్నారు. జిల్లాలో నాలుగు చోట్ల బస్తీ దవాఖానాలను ప్రజాప్రతినిధుల సమయం తీసుకుని వాటి ప్రారంభోత్సవాలకు చర్యలు తీసుకుంటాం.

# కబ్జా కోరల్లో.. కాల్వ కట్టలు?

నేరేడుచర్ల,:ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు సంబంధించిన స్థలాల కబ్జా యథేచ్ఛగా సాగుతున్నా.. ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. తాజాగా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలో ఫత్తేపురం ఆర్–8 ఎత్తిపోతల పథకం పక్కన ఎడమ కాల్వ కట్ట స్థలాన్ని చదును చేసి, మడులుగా మార్చి సాగర్ ఎడమ కాల్వకు పైప్‌లైన్లు వేసి సాగుకు సిద్ధం చేశారు. ప్రభుత్వం సాగర్ ప్రధాన కాల్వతో పాటు మేజర్లకు బౌండరీలు గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని గతేడాది నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించిన విషయం విదితమే. దీనికి సంబంధించి కొన్నిచోట్ల మార్కింగ్ సైతం ఇచ్చారు. ఒకరిని చూసి ఒకరు కాస్త వెడల్పుగా ఉన్న చోట ఆక్రమణలు జరిపి వరి సాగు చేపడుతున్నారు. ఎడమ కాల్వకు ఇరువైపులా కట్టలతో పాటు కొన్ని చోట్ల విశాలంగా స్థలాలు వదిలారు. ఆ స్థలాలను వినియోగించేవారు చాలా చోట్ల ఆక్రమించడంతో కట్టల పరిధి సైతం తగ్గిపోతోంది. కాల్వ కట్టల వెంట నిల్వ ఉంచిన ఎత్తయిన మట్టి గుట్టలు కాస్తా కనుమరుగై పోతుండటంతో భవిష్యత్తులో కాల్వ కట్టలకు గండ్ల ముప్పు పెరగనుంది. ఇదే పంచాయతీ పరిధిలో సాగర్ కాల్వల నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన ప్లాంట్ స్థలాలు సైతం ఇప్పటికే ఆక్రమణల పాలయ్యాయి. మేడారం శివారులోనూ కాల్వ కట్టల ఆక్రమణ ఎక్కువగా ఉంది. జాన్‌పహాడ్ మేజర్ పరిధిలోని ఆర్–3 కాల్వను నేరేడుచర్ల పట్టణంలో ఓ వైపు కట్ట రెండు, మూడు కిలోమీటర్ల మేర పూర్తిగా ఆక్రమించేశారు.



దీనికి తోడు పట్టణవాసులు కాల్వలో వ్యర్థాలు పోస్తుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మిర్యాలగూడ, హుజూర్‌నగర్ ప్రాంతాలలో కాల్వకట్టల ఆక్రమణలపై పలుసార్లు స్థానికులు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. ఆక్రమణలకు గురవుతున్న స్థలాన్ని రెవెన్యూశాఖ హరితహారం, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం ఏడెకరాల వరకు గ్రామపంచాయతీకి అప్పగించింది. ఈ ఆక్రమణలను వారే నిలువరించాల్సి ఉంటుంది. సాగర్ ఎడమ కాల్వ స్థలాలను ఆక్రమిస్తున్న విషయం వాస్తవమే. ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఇస్తే తప్ప వీటిని ఆపలేని పరిస్థితి. చాలా చోట్ల ఇప్పటికే కాల్వ స్థలాల ఆక్రమణలు జరిగాయి. ఫత్తేపురం వద్ద జరుగుతున్న ఆక్రమణలను నిలువరిస్తాం.

# చిరు వ్యాపారుల బతుకుల్లో ఆర్థిక వెలుగు



వనపర్తి, :కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పురపాలికల్లోని వీధి వ్యాపారుల అభ్యున్నతికి పెద్దపీట వేయడంతో వారిలో భరోసా పెరిగింది. వేలకు వేల రూపాయల అద్దెలు, రూ.లక్షల్లో అడ్వాన్సులు చెల్లించలేక రహదారుల వెంట చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి ఆర్థికంగా మరింత చేయూతనిచ్చేందుకు కేంద్రం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటా యించింది. మూడేళ్ల క్రితం కొవిడ్ కారణంగా లాక్‌డౌన్ విధించడంతో రోజూ ఫుట్‌పాత్‌లపై కూర్చుని చిరు వ్యాపారాలు చేసుకునే వీధి వ్యాపారుల జీవితాలు ఒక్కసారిగా కుదేలయ్యాయి. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి వీధి వ్యాపారులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి స్వనిధి (ఆత్మనిర్భర్) పథకాన్ని ప్రవేశపెట్టి చేయూతనిచ్చింది. పట్టణ పేదల నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో సర్వే చేయించి, అర్హులైన చిరు వ్యాపారులను గుర్తించి, వారికి గుర్తింపుపత్రాలిచ్చారు. ఎంపికచేసిన వారికి మొదటి, రెండో విడతల్లో రుణ సాయం అందించి ఆదుకుంది. వన పర్తి జిల్లాలోని అయిదు పురపాలక సంఘాల్లో కలిపి మొత్తం 6611 మంది వీధివ్యాపారులున్నట్టు గుర్తించి గుర్తింపుపత్రాలు ఇచ్చారు. వీరి ఉపాధిని మెరుగుపరిచేందుకు ఆత్మనిర్భర్ పథకం కింద మొదటి విడతగా రూ.10 వేలు అందించారు. డబ్బు తీసుకున్నవారు సకాలంలో చెల్లిస్తే రెండో విడతలో రూ.20 వేలు ఇచ్చారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనలో ఈ రుణపరిమితి రూ.లక్ష వరకు పెరగనుంది. ఆత్మనిర్భర్ పథకం కింద కూరగాయల వ్యాపారానికి రెండు విడతల రుణం తీసుకున్నా. మార్చి నుంచి రుణం పెంచి ఇస్తారని తెలిసింది. మేము కంతులు చెల్లించిన దాన్ని బట్టి రూ.లక్ష వరకు రుణమిస్తారని అంటున్నారు. అలాగైతే నా కూరగాయల దుకాణాన్ని మరింతగా విస్తరించి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటా. కరోనా కాలంలో పండ్ల వ్యాపారం పూర్తిగా కుదేలై అప్పు పుట్టలేదు. దీంతో పురపాలిక ద్వారా రుణాలిస్తున్నారని తెలిసి దరఖాస్తు చేసుకున్నా. రూ.10 వేల సాయం అందించారు. ఇచ్చిన రుణాన్ని చెల్లించేశా. మళ్లీ రుణం తీసుకుని వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటా. కేంద్రం అందించే ఆర్థిక సాయాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి. దీన్ని కుటుంబ ప్రగతికి ఓ నిచ్చెనగా చేసుకొని, ఆర్థిక ప్రగతి దిశగా సాగాలి. ఏప్రిల్ నుంచి ఆరంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో రుణ పరిమితి రూ.లక్ష వరకూ పెరగనుంది. అందుకే చిరు వ్యాపారులు చక్కగా తమ వ్యాపారాభివృద్ధికి ఇప్పటినుంచే చక్కటి ప్రణాళిక వేసుకొని, నిధుల్ని సద్వినియోగం చేసుకోవాలి.

# పంచాయతీల్లోనూ జనన, మరణ ధ్రువపత్రాలు

ధన్వాడ:జ నన, మరణ ధ్రువపత్రాల జారీలో ప్రస్తుతం మున్సిపాలిటీల్లో అమలు అవుతున్న విధానాన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం విస్తరించింది. దరఖాస్తును మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి. ఈ వివరాలను పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించుకున్నాక రికార్డుల్లో నమోదు చేసి ధ్రువపత్రం జారీ చేస్తారు. దీని ఆధారంగా మీ సేవ కేంద్రంలో పత్రాలు పొందవచ్చు. పారదర్శకతకు అవకాశం : చాలా మంది జనన, మరణ ధ్రువపత్రాలు అవసరం వచ్చినప్పుడే కార్యాలయాల చుట్టూ తిరుగుతారు. ఏళ్ల కిందట మరణించిన వ్యక్తుల ఆధారాల సేకరణ కష్టమవుతుంది. న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కోనే అవకాశం లేకపోలేదు. జనన,మరణ వివరాలను కార్యదర్శి రికార్డుల్లో నమోదు చేసి ఏడాది పాటు పంచాయతీల్లోనే ఉంచుకుంటారు. అనంతరం శాశ్వతప్రతిపాదికన వాటిని తహసీల్దార్లకు అప్పగిస్తారు. వాటి ఆధారంగా ధ్రువపత్రాలు జారీ చేస్తారు. ప్రస్తుత కొత్త విధానం ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేసినట్లయ్యింది. ఈ పత్రాలు లేని పక్షంలో సంక్షేమ పథకాలతో సహా ఇతర చిక్కులకు దారి తీసిన ఉదంతాలూ ఉన్నాయి. పత్రాలు కావాల్సిన వారు మీ సేవలో రూ.45 చెల్లించి రాష్ట్రంలో ఎక్కడి నుంచైన పొందే అవకాశం ఉంది. ఆన్‌లైన్ దరఖాస్తు నెంబరు ఎప్పటికీ భద్రంగా ఉంటుంది. మరణించిన వ్యక్తి పేరున ఒకసారి ధ్రువపత్రం జారీ అయితే ఎవరి ప్రమేయం లేకుండానే ఆసరా పింఛను, రేషన్ బియ్యం, ఓటరు కార్డు రద్దవుతుంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్ల కొరత వేధిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 13 మండలాలు, 280 గ్రామ పంచాయతీలు ఉంటే 50 లోపు పంచాయతీ కార్యాలయాలకే కంప్యూటర్లు అందజేశారు. వీటి నిర్వహణకు కార్యదర్శులకు ఎలాంటి



శిక్షణ ఇవ్వలేదు. ధన్వాడ మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం నాలుగు పంచాయతీలకే కంప్యూటర్లు అందజేశారు. వీటి నిర్వహణపై శిక్షణ ఇవ్వని కారణంగా రెండు కంప్యూటర్లను మండల పరిషత్ కార్యాలయంలో ఉంచి ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించుకొని ఆపరేట్ చేస్తున్నారు. ప్రస్తుతం కంప్యూటర్లు లేని పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్‌కే జనన, మరణ దరఖాస్తుదారుడి వివరాలు తెలియజేయాల్సి వస్తోంది. ఈకారణంగా ధ్రువపత్రాల జారీలో జాప్యం జరిగే అవకాశం ఉంది. ప్రతి పంచాయతీకి కంప్యూటర్లు అందజేస్తే లక్ష్యం నెరవేరడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. ప్రతి గ్రామ పంచాయతీకి ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ ఇవ్వాలని ప్రభుత్వ ఆలోచన. దీనిపై సాధ్యమైనంత త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండల పరిషత్ కార్యాలయంలోని కంప్యూటర్ల ద్వారా వివరాలు నమోదు చేసుకొని జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నాం.

# ఇళ్లకు సౌర వెలుగులు



మహబూబ్‌నగర్ :విద్యుత్తు బిల్లు భారీగా రావటం పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారుతోంది. సరఫరాలో తరచూ అంతరాయాలు తలెత్తుతుండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సౌర విద్యుత్తు యూనిట్ ఏర్పాటు చేసుకుంటే ఈ ఇబ్బందులేవీ ఉండవు. ఎవరి ఇళ్లపై వారు తమకు అవసరమైన సామర్థ్యం మేరకు సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకొని విద్యుత్తును వినియోగించుకునే అవకాశంఉంటుంది. ఈ దిశగా మహిళా సంఘాల సభ్యులను గ్రామీణాభివృద్ధి శాఖ సమాయత్తం చేస్తోంది. జిల్లాకు 200 – 300 యూనిట్ల లక్ష్యం : రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీఎస్ రెడ్కో) మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు ఈ ఏడాదికి 250–300 వరకు సౌర విద్యుత్తు యూనిట్లను కేటాయించింది. జోగులాంబ గద్వాల జిల్లాకు మాత్రం 200 యూనిట్లు కేటాయించింది.. వీటిని సద్వినియోగం చేసుకునేలా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలకు అవగాహన కల్పించి ప్రోత్సహించేందుకు డీఆర్డీఏ సిబ్బంది, పురపాలికల్లో మెప్మా సీసీలను అధికారులు సమయాత్తం చేశారు. సౌర విద్యుత్తు యూనిట్ ఏర్పాటు చేసుకోవాలంటే లబ్ధిదారుకు ఆర్‌సీసీ మిద్దె కలిగిన ఇల్లు ఉండాలి. ప్రస్తుతం వారి గృహానికి నెలకు రూ. 160 నుంచి రూ.225 వరకు విద్యుత్తు బిల్లు వస్తూ ఉండాలి.

# ధరణిలో పేరు కనిపిస్తే.. మళ్లీ విక్రయం !

నాగర్‌కర్నూల్:ధరణి రాక ముందు భూముల రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత మ్యుటేషన్ చేయించుకోకపోతే ఆ భూములన్నీ మళ్లీ ధరణిలో పాత పేర్లపైనే కనిపిస్తున్నాయి. దీనిని ఆసరాగా తీసుకొని కొందరు ఆయా భూములు తమవే అంటూ మళ్లీ అమ్ముకుంటున్నారు. భూముల ధరలు పెరగటంతో అనేక వివాదాలకు దారి తీస్తున్నాయి. ధరణిలో పాత యజమానుల పేర్లు వస్తున్నా.. తహసీల్దార్లు ఏమి చేయలేకపోతున్నారు. బాధితులు సంప్రదిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచిస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్లలో నిర్వహించే ప్రజావాణికి సైతం 90 శాతం దరఖాస్తులు భూ వివాదాలకు సంబంధించినవే ఉంటున్నాయి. కోర్టులకు వెళ్లిన సర్వే నంబర్లన్నింటికి ధరణిలో ఎలాంటి లావాదేవీలు జరుపకుండా నిలిపివేస్తున్నారు. దీంతో చాలా మంది రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం రోడ్డులో రమేశ్ 1.20 ఎకరాల భూమిని ధరణి రాకముందు కొనుగోలు చేశారు. మ్యుటేషన్ చేయించుకునే సమయంలోనే ధరణి వచ్చేసింది. ధరణిలో రమేశ్‌కు అమ్మిన వ్యక్తి పేరు కనిపించింది. దీంతో ఆ భూమిని పాత యజమాని మళ్లీ ఇతరులకు అమ్ముకున్నాడు. ఆ భూమి విలువ ప్రస్తుతం రూ.40లక్షలు. దీంతో రమేశ్ ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. నాగర్‌కర్నూల్ మండలం నాగనూల్ శివారులో మధుసూదన్ 1.30 ఎకరాల భూమిని కొనుగోలు చేసి మ్యుటేషన్ చేయించుకోలేదు. ఆ తర్వాత అతను మ్యుటేషన్‌కు వెళ్లే సరికే ఆ భూమి ఇద్దరి చేతులు మారింది. దీనికి పక్కనే ఉన్న ఆరు ఎకరాల భూమి ఇదే సర్వే నంబరు కావడం, ఎకరా భూమి రూ.40లక్షలకు పైగా ఉండటంతో వివాదాస్పదమైంది. నిత్యం



ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. కొల్లాపూర్, కొడేరు, పెద్దకొత్తపల్లి మండలాల్లో ధరలు పెరుగటంతో గతంలో అమ్మిన వారే ధరణిలో తమ పేర్లు వచ్చాయనే నెపంతో మళ్లీ అమ్ముకున్న సంఘటనలు 10 వరకు ఉన్నాయి. అవన్ని ఇప్పుడు కోర్టు వివాదంలో నడుస్తున్నాయి. ధరణి కంటే ముందు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు ఇప్పుడు ధరణిలో పాత పేర్లే వస్తే పెండింగ్ మ్యూటేషన్ కింద దరఖాస్తులు చేసుకోవాలి. అప్పటికే ధరణిలో పేరు ఉన్న వ్యక్తి నిజాయతీ తప్పి లావాదేవీలు జరిపితే కోర్టుకు వెళ్లాల్సిందే. న్యాయస్థానం ద్వారా ఆదేశాలు తెచ్చుకొని అమలు చేసుకోవాలి. ఇప్పుడు అలాంటివి సరిచేయటానికి తహసీల్దార్ల వద్ద ఎలాంటి అధికారాలు లేవు. కొన్ని చోట్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. తమ పరిధిలో ఉన్నవి చాలా వరకు భూముల సమస్యలను పరిష్కరిస్తున్నాం. కోర్టుల్లో పెండింగ్‌లో ఉంటేనే పెండింగ్‌లో ఉంటున్నాయి.

# వరుస కడుతున్న వలస కూలీలు

మోర్తాడ్, : పసుపు పంట వచ్చిందంటే ఆర్మూర్ డివిజన్ ఒక కళ సంతరించుకుం టుంది. ఈ ప్రాంతం లో పసుపు పంటను రైతులు అధికంగా పండించడమే అందుకు కారణం. పసుపు పంట చేతికి వచ్చిందంటే పసుపు తవ్వకం నుంచి మార్కెట్‌కు తరలించే వరకు కూలీల అవసరం ఉంటుంది. పసుపు తవ్వకాల నుంచి ఉడకబెట్టేందుకు మహారాష్ట్ర నుంచి కూలీలు ఈప్రాంతానికి తరలివస్తారు. మహారాష్ట్రలోని నాందేడ్‌తోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి వేల సంఖ్యలో కూలీలు డిసెంబర్ మాసంలోనే ఇక్కడికి వస్తారు. మా ర్చి వరకు ఇక్కడే ఉంటారు. దాదాపు మూడు వేలకు పైగా కూలీలు మహారాష్ట్ర నుంచి ఇక్కడికి తరలివస్తారని అంచనా. పసుపు తవ్వకాల నుంచి పసుపును మార్కెట్‌కు తరలించే వరకు వివిధ రకాల పనుల కోసం మహారాష్ట్ర నుంచి నిజామాబాద్ జిల్లాకు దాదాపు మూడు వేలకు పైగా కూలీలు ఏటా తరలివస్తుంటారు. ఇక్కడి ప్రాంత రైతులతో సమాచారాన్ని అందుకొని కుటుంబాలతోసహా తరలివచ్చి నాలుగు నెలలపాటు ఇక్కడే ఉంటారు. పసుపు ఆవిరిపట్టే యంత్రాలు కలిగి ఉన్న రైతులు కూలీల గ్యాంగులను ఇక్కడికి రప్పిస్తారు. ఒక్కో గ్యాంగ్‌లో ఎనిమిది నుంచి పది మంది వరకు ఉంటారు. ఈవిధంగా ఆర్మూర్ డివిజన్‌లో దాదాపు మూడు వందల వరకు ఆవిరియంత్రాలు ఉంటాయి. దాదాపు మూడు వేల మంది కూలీలు ఈప్రాంతానికి తరలివస్తుంటారు. పసుపు ఉడకబెట్టే కూలీలను ఎక్కడ చూసినా మహారాష్ట్రకు సంబంధించిన వారే ఉంటారు. పసుపు సీజన్‌లో వచ్చిన కూలీలు ఒక్కొక్కరు కనీసం రూ.40–50వేల వరకు సంపాదించుకుని తిరిగి వెళ్తారు. ఆవిరియంత్రం ద్వారా పసుపును ఉడకబెట్టే మహారాష్ట్ర గ్యాంగులకు డ్రమ్ము పసుపు ఉడకబెట్టినందు కు రూ.80 చెల్లిస్తారు.



వీరు రోజుకు కనీసం 50 డ్ర మ్ముల పసుపును ఉడకబెడతారు. దీంతోపాటు పసుపు తవ్వకానికి వెళ్తుంటారు. సీజన్ ముగిసే వర కు కూలీలు ఇక్కడే ఉంటారు. వీరు గత 15సంవత్సరాలుగా ఈ ప్రాంతానికి పసుపు సీజన్‌లో వస్తున్నారు. మా గ్రామంలో కూడా కూలీ పనులే చేస్తుంటాం. పసుపు సీజన్ వచ్చిందంటే ని జామాబాద్ జిల్లాకు వస్తాం. పసుపు సీజన్ పూర్తయినంక తిరిగి వెళ్తాం. మాగ్యాంగ్‌లో ఎనిమిది మందిమి ఉన్నాం. ప్రతి రోజూ కనీసం రూ.500 ఒక్కో మనిషికి వచ్చేలా చూసుకుంటాం. మేము 15ఏండ్లుగా ఇక్కడికి వస్తున్నాం. మిషన్ ఓనర్ ఫోన్ చేయగానే ఇక్కడికి బయల్దేరుతాం. అందరం కలిసి పసుపును ఉడకబెట్టే పనులు చేస్తాం. ఒక్క డ్రమ్ము పసుపునకు రూ.80 ఇస్తారు. రోజుకు దాదాపు 50 డ్రమ్ముల పసుపును ఉడకబెడతాం. సీజన్ ముగిసిన తర్వాత ఇంటికి వెళ్తాం.

# బడ్జెట్ వచ్చినా చెల్లింపులేవీ?

మోత్కూరు, : ఒక నెల వేతనం ఆలస్యమైతే నలుగురైదుగురు సభ్యులున్న కుటుంబాన్ని పోషించేందుకు యజమాని నానా ఇబ్బంది ఎదుర్కొంటాడు. అలాంటిది ఈ విద్యా సంవత్సరంలో హాస్టళ్లు తెరిచిన నాటి నుంచి ఎనిమిది నెలలుగా విద్యార్థుల డైట్ బిల్లును ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేందుకు వార్డెన్లు తంటాలు పడుతున్నారు. అయినా ప్రభుత్వానికి పట్టడంలేదని వసతి గృహాల సంక్షేమాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహాలకు సరుకులు సరఫరా చేసేందుకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లకు అప్పగించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్లు పాలు, పెరుగు, కూరగాయలు, నిత్యావసర సరుకులు సరఫరా చేస్తారు. కాగా, ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వం టెండర్లు నిర్వహించలేదు. దీంతో వసతి గృహ సంక్షేమాధికారులు సొంతంగా డబ్బు చెల్లించి సరుకులు సరుకులు సమకూర్చుతున్నారు. ఇంటి అవసరాలకు వాడాల్సిన వేతనాన్ని విద్యార్థులకు భోజనం అందించేందుకు వినియోగిస్తున్నారు. అంతేగాక దొరికిన చోటల్లా అప్పు చేసి విద్యార్థుల ఆకలి తీరుస్తున్నారు. ఎనిమిది నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 47 గిరిజన సంక్షేమ, 78 వెనుకబడిన తరగతుల సంక్షేమ, 80 ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. మొత్తం 205 హాస్టళ్లలో సుమారు 25వేల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరికి పౌష్టికాహారం అందించేందు ప్రభుత్వం డైట్ బిల్లులు చెల్లిస్తోంది. 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.950 ఇస్తోంది. అదేవిధంగా 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1100 చొప్పున, కళాశాల విద్యార్థులకు రూ.1500 చొప్పున డైట్ బిల్లు చెల్లిస్తోంది. ఈ ధరలు రెండేళ్ల క్రితం నిర్ణయించిన



కాగా, ప్రస్తుతం మార్కెట్లో నిత్యావసర సరకుల ధరలు రెట్టింపయ్యాయి. అయినా ప్రభుత్వం డైట్ బిల్లును మాత్రం పెంచలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్సీ, బీసీ సంక్షేమ విద్యార్థుల వసతి గృహ అధికారులకు హాస్టళ్లు తెరిచిన నాటి (జూన్)నుంచి ఎనిమిది నెలలుగా డైటు బిల్లుల చెల్లింపులు నిలిచాయి. బిల్లులు చేసి ట్రెజరీల్లో ఇచ్చి రెండుమూడు నెలలైనా బిల్లులు మంజూరు కావడంలేదు. గత ఏడాది అక్టోబరు వరకు బడ్జెట్ రిలీజ్ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే అక్టోబరు వరకు బిల్లులు చేసి ట్రెజరీలకు పంపగా, నేటికీ ఒక్క రూపాయి చెల్లించలేదని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్రెజరీలకు పంపిన బిల్లులు నాలుగైదు రోజుల్లో మంజూరు కావడంతోపాటు బ్యాంకుకు వెళ్లేవి. దీంతో వార్డెన్లు బ్యాంకుకు వెళ్లి డబ్బు తీసుకునేవారు. కాగా, ప్రస్తుతం ట్రెజరీలకు పంపిన బిల్లులు మంజూరయ్యాక ఈ–కుబేర్‌కు వెళ్తున్నాయి. ప్రభుత్వ ఆర్థికశాఖ ఈ–కుబేర్ బిల్లులకు డబ్బు చెల్లిస్తుంది. అయితే చెల్లింపులపై ఆర్థికశాఖ ఆంక్షలు విధించడంతో ఈ–కుబేర్‌కు వెళ్తున్న బిల్లులకు డబ్బు మంజూరవడం లేదు. (

# అటవీశాఖ అర్బన్ పార్కు త్వరలో ప్రారంభం



నాగార్జునసాగర్, : నాగార్జునసాగర్ డివిజన్ అటవీశాఖ పరిధిలో నెల్లికల్లు బీట్‌లో రూ.1.50 కోట్లతో 250ఎకరాల్లో ఏర్పాటు చేసిన అటవీశాఖ అర్బన్ పార్కును త్వరలో ప్రారంభిస్తామని అటవీశాఖ రీజినల్ డైరెక్టర్ త్రినాథ్‌కుమార్ తెలిపారు. సాగర్ హిల్‌కాలనీ అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించి, తర్వాత బుద్ధవనం ప్రాజెక్టును తిలకించారు. సమ్మక్క–సారక్క దేవాలయం సమీపంలో నెల్లికల్లు బీట్‌లో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కును పరిశీలించారు. పార్కులో నాటిన మొక్కలను మనుబోతులు తింటుడాన్ని గమనించిన ఆయన మనుబోతులు తినని మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. నేరేడు మొక్కలు ఇతర జంతువులు తినకుండా ఉన్నాయని వాటిని ఎక్కువగా నాటాలని సూచించారు. అర్బన్ పార్కులో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. వేసవి కాలం సమీపిస్తున్నందున్న అడవిలో జంతువలు దహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన సాసర్ ట్యాంకుల్లో నీళ్లు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎఫవో రాంబాబు, సాగర్ ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్‌ఎసవో రమేష్ ఉన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనం ప్రాజెక్టును అటవీశాఖ రీజనల్ డైరెక్టర్ త్రినాథ్ కుమార్ సందర్శించారు. అటవీశాఖ డివిజన్ పరిధిలో అబివృద్ధి పనుల పరిశీలించేందుకు నాగార్జునసాగర్‌కు వచ్చిన ఆయన బుద్ధవనాన్ని సందర్శించారు.

Printed And Published By V.Narsingam, On Behalf Of Ch.V. Prabhakar Rao And Printed At Sri Sharadha Offset Printers. H.No.9-14/8/3, Buggaram Village And Mandal, Buggaram Gramapanchayath- 505454, Jagtial District, Telangana State.. Published At 6-6-206,Padma Nagar, Jagtial - 505327, Jagtial District, Telangana State.
Editor : Ch V. Prabhakar Rao, Rni T.C. Teltel 2021/81092 Phone : 9391533339 Email: Prajamantalu@Gmail.Com